thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 207 | జగిత్యాల మంగళవారం 10 నవంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

న్యూజిలాండ్‌కు డబుల్ షాక్!



11

రెండో విడత జనగణనకు షెడ్యూల్ ఖరారు!

- రెండో విడత జనాభా లెక్కింపునకు షెడ్యూల్ విడుదల
- జనవరి 10 నుంచి 24 వరకు స్వీయ నమోదుకు అవకాశం
- జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఇంటింటి సర్వే
- మార్చి 1 నుంచి 5 వరకు తప్పులు, మార్పుల సవరణ
- 2027 మార్చి 1 అర్ధరాత్రే జనగణనకు ప్రామాణిక సమయం
- జీఓ 155 జారీ చేసిన ప్రభుత్వం.. అధికారులకు కీలక ఆదేశాలు

2



దేశవ్యాప్తంగా చేపడుతున్న ప్రతిష్టాత్మక 'జనగణన--2027'లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో రెండో విడత జనాభా లెక్కింపు నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక షెడ్యూలును ఖరారు చేస్తూ విడుదల చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ కీలకమైన జీఓ నంబర్ 155ను జారీ చేసింది. కేంద్ర హోంశాఖ పరిధిలోని రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ కార్యాలయం అక్టోబర్ 30న విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్తర్వులను తెలంగాణ రాష్ట్ర గెజెట్‌లో పునఃప్రచురించింది.



పది జన్మలెత్తినా కేటీఆర్.. రేవంత్ కాలేడు!

కేటీఆర్‌కు గడ్డం వచ్చింది.. బుద్ధి ఎప్పుడొస్తుందో?

- పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నంత మాత్రాన పులి కాలేదంటూ ఎద్దేవా
- పాలమూరు అభివృద్ధిని పదేళ్లపాటు అడ్డుకున్నారని బీఆర్ఎస్‌పై విమర్శలు
- డిసెంబర్ నాటికి కొడంగల్‌కు కృష్ణా జలాలు తెస్తానని హామీ
- రూ.9 వేల కోట్లతో కొడంగల్‌ను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడి
- మోదీ, కేడీలనైనా ఎదుర్కొంటా..
- లగచర్ల సభలో సీఎం ఘాటు వ్యాఖ్యలు

లగచర్ల (వికారాబాద్ జిల్లా), నవంబర్ 9 (చురకలు): బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "కేటీఆర్‌కు గడ్డం రావడానికి 50 ఏళ్లు పట్టింది.. బుద్ధి రావడానికి ఇంకెన్ని ఏళ్లు పడుతుందో! గడ్డం మోకాళ్ల వరకు పెంచుకున్నా పది జన్మలెత్తినా రేవంత్‌రెడ్డి కాలేడు. రేవంత్ కావాలంటే గుండె ధైర్యం ఉండాలి. నమ్ముకున్న ప్రజల కోసం నిలబడే తెగువ ఉండాలి" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నంత మాత్రాన నక్క ఎప్పటికీ పులి కాలేదని ఎద్దేవా చేశారు. మూడు రోజుల కొడంగల్ పర్యటన ముగింపు సందర్భంగా లగచర్లలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. పాలమూరు ప్రాంత అభివృద్ధిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అడ్డుకుందని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా

మిగతా 2 లో



రాష్ట్ర అభివృద్ధికి కీలక కేంద్రంగా కొడంగల్

- పారిశ్రామిక, విద్య, వైద్య, సాగునీటి రంగాల అభివృద్ధికి సీఎం ప్రణాళికలు
- లగచర్ల రైతు బహిరంగ సభలో భట్టి విక్రమార్క


2

టపాసుల పేలుళ్లతో 60 మందికి కంటి గాయాలు

- సరోజినీ దేవి ఆస్పత్రిలో 60 ఓపీ కేసులు నమోదు
- 10 మంది ఇన్‌పేషెంట్లుగా చికిత్స.. ఎనిమిది మందికి శస్త్రచికిత్స
- బాధితుల్లో సుమారు 30 మంది చిన్నారులు
- ఇద్దరికి చూపు కోల్పోయే ప్రమాదం.. వైద్యుల హెచ్చరిక

వివరాలు 2లో..





ప్రైవేట్ పాఠశాలల్లో 'ప్రశస్త్' స్క్రీనింగ్ తప్పనిసరి

3 నుంచి 18 ఏళ్ల పిల్లల్లో అభ్యాసన లోపాలు, దివ్యాంగత్వాల గుర్తింపు

3

రంగారెడ్డి కలెక్టర్‌కు జైలు శిక్ష!

- శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా
- కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు తీర్పు

2





బియ్యం ధరలకు కళ్లెం

- రకాలను బట్టి గరిష్ట ధరలు ఖరారు
- బీపీటీ, కేఎన్ఎం కిలో రూ.66కు మించకూడదు
- ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా ధర రూ.74గా నిర్ణయం
- హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకాల గరిష్ట ధర రూ.79
- అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌పై పీడీ యాక్ట్

3



అండాల విక్రయ దందాపై మహిళా కమిషన్ ఆగ్రహం

- 50 మంది యువతులు బాధితులుగా గుర్తింపు
- ఉద్యోగాల పేరుతో యువతులకు వల వేసిన ముఠా

3

షేక్‌పేట్‌లో వ్యభిచారం ముసుగులో డ్రగ్స్ దందా



బంగ్లాదేశ్ మహిళతో పాటు లివ్ ఇన్ పార్ట్‌నర్ అరెస్ట్

వివరాలు 3లో..

బతికున్నోళ్ల పేరిట డెత్ సర్టిఫికెట్లు



- ప్రభుత్వ డిజిటల్ కీని ప్రైవేట్ వ్యక్తికి విక్రయించిన పంచాయతీ కార్యదర్శి
- హైదరాబాద్ ఇంటర్నెట్ సెంటర్ నుంచి నకిలీ సర్టిఫికెట్ల తయారీ
- 2026 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు 22 నకిలీ ధ్రువీకరణ పత్రాలు
- ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లతో లక్షల రూపాయలు కాజేసినట్లు ఆరోపణలు

3



అన్ని వైద్య సేవలు జిల్లాల్లోనే..

- సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థను బలోపేతం చేస్తాం
- ఏరియా హాస్పిటల్స్, హెల్త్ సెంటర్లలో సదుపాయాల కల్పన
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్

3



రంగారెడ్డి కలెక్టర్‌కు ఆరు నెలల జైలు శిక్ష!

శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా

కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు తీర్పు

హైదరాబాద్, నవంబర్ 9 (చురకలు): న్యాయస్థానం ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలను నిర్లక్ష్యం చేసిన వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు అత్యంత కఠిన నిర్ణయం తీసుకుంది. కోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినట్లు ఆధారాలతో సహా నిర్ధారిస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా కూడా వెంటనే చెల్లించాలని ఆదేశించింది. జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. అయితే సైకోర్టులో అప్పీలు చేసుకునేందుకు వీలుగా శిక్ష అమలును నాలుగు వారాల పాటు నిలిపివేస్తున్నట్లు తీర్పులో స్పష్టం చేసింది. రిజిస్ట్రేషన్ చట్టం–1908లోని సెక్షన్ 22–ఏ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితా నుంచి కొన్ని స్థిరాస్తి ప్లాట్లను తొలగించాలంటూ బాధితులు సమర్పించిన వినతిని క్షుణ్ణంగా పరిశీలించాలని గతంలో హైకోర్టు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. 2025 ఆగస్టులో జారీ చేసిన ఆదేశాల ప్రకారం 60 రోజుల్లోగా దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయినప్పటికీ నిర్దేశిత గడువు ముగిసినా కలెక్టర్ కార్యాలయం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో బాధితులు అదే ఏడాది అక్టోబర్ 15న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు.

పిటిషన్ దాఖలయ్యాకే నామమాత్రపు చర్యలు

న్యాయస్థానంలో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాతే జిల్లా అధికార యంత్రాంగం నిద్రలేచి స్పందించింది. బాధితులకు అలస్యంగా నోటీసులు జారీ చేసి, 2026 ఫిబ్రవరి 26న వారి వినతిని తిరస్కరిస్తున్నట్లు పేర్కొంది. అనంతరం జులై 8న మరోసారి తిరస్కరణ ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయస్థానంలో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలయ్యే వరకు అస్సలు స్పందించకుండా, ఆ తర్వాత మాత్రమే ప్రక్రియ చేపట్టినట్లు నామమాత్రపు చర్యలు ప్రారంభించడంపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. కోర్టు నిర్దేశించిన గడువులోగా ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా, పిటిషన్ దాఖలయ్యాక నామమాత్రపు చర్యలతో సరిపెట్టడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. కలెక్టర్ ఉద్దేశపూర్వకంగానే న్యాయస్థానం ఆదేశాలను దిక్కరించి ఉల్లంఘించినట్లు ధర్మాసనం నిర్ధారించింది. బాధ్యతాయుతమైన ఐఏఎస్ స్థాయి అధికారి కోర్టు ఉత్తర్వులను నిర్లక్ష్యం చేయడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని పేర్కొంటూ ఆరు నెలల జైలు శిక్ష, జరిమానా విధించింది. ఈ తీర్పుపై ఉన్నత ధర్మాసనంలో అప్పీలు దాఖలు చేసుకునేందుకు వీలుగా నాలుగు వారాల పాటు శిక్ష అమలును నిలిపివేసింది.

టపాసుల పేలుళ్లతో 60 మందికి కంటి గాయాలు

సరోజినీ దేవి ఆస్పత్రిలో 60 ఓపీ కేసులు నమోదు

10 మంది ఇన్‌పేషెంట్లుగా చికిత్స.. ఎనిమిది మందికి శస్త్రచికిత్స

బాధితుల్లో సుమారు 30 మంది చిన్నారులు

ఇద్దరికి చూపు కోల్పోయే ప్రమాదం.. వైద్యుల హెచ్చరిక

హైదరాబాద్, నవంబర్ 9 (చురకలు): దీపావళి వేడుకల్లో బాణసంచా పేలుళ్లు పలువురి కంటి చూపుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. టపాసులు కాల్చే సమయంలో చోటుచేసుకున్న ప్రమాదాల్లో గాయపడిన వారు చికిత్స కోసం సరోజినీ దేవి కంటి ఆస్పత్రికి పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఇప్పటివరకు 60 మంది బాధితులు ఔట్ పేషెంట్ (ఓపీ) విభాగంలో నమోదైనట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. వీరిలో పలువురి గాయాలు తీవ్రంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తొలుత 13 మందిని ఆస్పత్రిలో చేర్చినట్లు సమాచారం వెలువడగా, సూపరింటెండెంట్ తాజా వివరాల ప్రకారం ప్రస్తుతం 10 మంది ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. వీరిలో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు కావడంతో శస్త్రచికిత్స కోసం ఆపరేషన్ థియేటర్‌కు తరలించారు. ఒక బాధితుడి కంటి గుడ్డు బయటకు వచ్చినట్లు వైద్యులు వెల్లడించారు. మరో ఇద్దరికి కంటి చూపు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాల్లో చిన్నారులు కూడా అధిక సంఖ్యలో గాయపడటం ఆందోళన కలిగిస్తోంది. నమోదైన 60 కేసుల్లో దాదాపు 30 మంది పిల్లలే ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. బాణసంచా కాల్చిన వారితో పాటు రహదారులపై నడుచుకుంటూ వెళ్తున్న పాదచారులు కూడా ప్రమాదాల బారినపడ్డారు. కంటి గాయాలతో వచ్చిన వారికి సరోజినీ దేవి ఆస్పత్రిలో వైద్యం అందిస్తుండగా, చర్మంపై కాలిన గాయాలతో బాధపడుతున్న వారిని మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి పంపిస్తున్నారు. దీపావళి వేడుకల్లో భాగంగా మరిన్ని టపాసులు కాల్చే అవకాశం ఉండటంతో బాధితుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉందని వైద్యులు అంచనా వేస్తున్నారు. బాణసంచా కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా కంటిచూపు శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. చిన్నారులు టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు దగ్గరుండి పర్యవేక్షించాలని, ప్రమాదకరమైన బాణసంచాకు పిల్లలను దూరంగా ఉంచాలని చెబుతున్నారు. కంటికి గాయమైనప్పుడు ఇంటివద్దే చికిత్స చేసుకునే ప్రయత్నం చేయకుండా వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచిస్తున్నారు.



పది జన్మలెత్తినా కేటీఆర్.. రేవంత్ కాలేడు!

మొదటి పేజీ తరువాయి

కొడంగల్‌కు కృష్ణా జలాలను తీసుకొచ్చి రైతుల పొలాలను సస్యశ్యామలం చేస్తానని ప్రకటించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు దశాబ్దాలుగా సాగునీరు, ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బూర్గుల రామకృష్ణారావు కాలం నుంచి ఎంతోమంది నాయకులు ఈ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహించినప్పటికీ వలసలు ఆగలేదన్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమ కష్టాలు తీరుతాయని భావించి కేసీఆర్‌కు ప్రజలు మద్దతిచ్చారని, అయితే ముఖ్యమంత్రి అయ్యాక ఆయన పాలమూరు ప్రజల ఆకాంక్షలను పక్కనపెట్టి గజ్వేల్‌కు వెళ్లిపోయారని విమర్శించారు. గత పదేళ్లలో పాలమూరు అభివృద్ధిని ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని సీఎం ఆరోపించారు. కేసీఆర్ హయాంలో రూ.8.11 లక్షల కోట్ల అప్పులు చేసి చివరకు ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యారని విమర్శించారు. తమ ప్రభుత్వానికి అబద్ధాలు చెప్పే అలవాటు లేదని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించే ప్రయత్నాలను అడ్డుకోవడం సరికాదన్నారు. కొడంగల్ నియోజకవర్గానికి కృష్ణా జలాలను తీసుకురావడమే తన ప్రధాన లక్ష్యమని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి కృష్ణా జలాలను కొడంగల్‌కు తీసుకొచ్చి బీడు భూములను పచ్చని పంట పొలాలుగా మారుస్తానని పోలేపల్లి ఎల్లమ్మతల్లి సాక్షిగా ప్రమాణం చేశారు. రైతులకు సాగునీరు అందించడంలో రాజీపడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఒకప్పుడు కొడంగల్ ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇతర జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని సీఎం గుర్తుచేశారు. ఇప్పుడు ఆ పరిస్థితిని మార్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు. నియోజకవర్గంలో రూ.9 వేల కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. కొడంగల్‌ను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. విద్య, సాగునీరు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 2023లో కొడంగల్ ప్రజల ఆశీస్సులతో తన ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునే అవకాశం లభించిందని రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా ప్రజల కోసం పనిచేస్తున్నానని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు. కొడంగల్ ప్రజలు తనకు అండగా నిలిచారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల భారం తమ ప్రభుత్వంపై పడిందని సీఎం విమర్శించారు. గడిచిన 34 నెలల్లో రూ.2 లక్షల కోట్లకు పైగా వడ్డీలు చెల్లించినట్లు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. 2024 జనవరి 1 నుంచి ప్రతి నెలా ఒకటో తేదీన 11 లక్షల మంది ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమ చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుతూనే సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. కొడంగల్ ప్రజల అండదండలు ఉన్నంతకాలం ఎవరినైనా ఎదుర్కొనే ధైర్యం తనకు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. "కొడంగల్ ప్రజలు నా వెనుక ఉంటే ఢిల్లీలో మోదీనైనా, రాష్ట్రంలో కేడీనైనా ఎదుర్కొంటా" అని వ్యాఖ్యానించారు. ప్రజల మద్దతే తనకు అసలైన బలమని పేర్కొన్నారు. సంక్రాంతి తర్వాత 'ప్రజాబలం' పేరుతో ప్రజల్లోకి



వస్తామని ప్రకటించారు. ప్రజల మద్దతుతో రాజకీయంగా బలమైన ఉద్యమాన్ని నిర్మిస్తామని చెప్పారు. ఆ ప్రజాబలం ముందు ప్రత్యర్థులు నిలవలేరని ధీమా వ్యక్తం చేశారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తా

జర్నలిస్టులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని సీఎం భరోసా ఇచ్చారు. వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. మూడు రోజుల కొడంగల్ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, లగచర్ల బహిరంగ సభ అనంతరం రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు.

రాష్ట్ర అభివృద్ధికి కీలక కేంద్రంగా కొడంగల్

- పారిశ్రామిక, విద్య, వైద్య, సాగునీటి రంగాల అభివృద్ధికి సీఎం ప్రణాళికలు
- లక్షలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా పారిశ్రామిక కారిడార్లు
- లగచర్ల రైతు బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్, నవంబర్ 9 (చురకలు): తరతరాలుగా వెనుకబాటుకు గురైన పాలమూరు ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ కొడంగల్‌ను రాష్ట్రానికే కీలక పారిశ్రామిక, విద్య, వైద్య కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టితో ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలు భవిష్యత్తులో లక్షలాదిమంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నాయని చెప్పారు. కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటలో లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో సోమవారం ఏర్పాటు చేసిన రైతు బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి పాల్గొన్న భట్టి విక్రమార్క ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. పాలమూరు జిల్లా అందులోనూ కొడంగల్ నియోజకవర్గం దశాబ్దాలుగా వెనుకబాటుకు గురైందని, అలాంటి ప్రాంతానికి చెందిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం కొడంగల్ ప్రజల అదృష్టమని అన్నారు. ముఖ్యమంత్రి తన సొంత ప్రాంత అభివృద్ధికి మాత్రమే కాక ఈ ప్రాంత భవిష్యత్తు తరాల జీవితాల్లో వెలుగులు నింపేలా సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించి కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకుంటున్నారని ప్రశంసించారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గంట వ్యవధిలో కొడంగల్‌కు చేరుకునేలా రహదారి సదుపాయాలను అభివృద్ధి చేయడంతోపాటు, ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ పెట్టుబడులకు అనువైన పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. కొడంగల్‌లో మడు వేల ఎకరాలు, పరిగిలో రెండు వేల ఎకరాలు, సీతారాంపూర్, చందనవెల్లి ప్రాంతాలను కలుపుకుని సుమారు ఐదు వేల ఎకరాల్లో పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఈ ప్రాంతానికి భారీ పెట్టుబడులు తరలివచ్చేలా, పరిశ్రమల స్థాపన ద్వారా లక్షలాదిమందికి ఉద్యోగావకాశాలు కల్పించేలా ముఖ్యమంత్రి ముందుచూపుతో అడుగులు వేస్తున్నారన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా కొడంగల్ అభివృద్ధి

పారిశ్రామిక అభివృద్ధితోపాటు విద్యారంగానికి ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని భట్టి విక్రమార్క తెలిపారు. మెడికల్ కాలేజీ, ఇంజినీరింగ్ కాలేజీ, పాలిటెక్నిక్, ఐటీఐ, మహిళా డిగ్రీ కళాశాల, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, తెలంగాణ పబ్లిక్ స్కూల్ వంటి విద్యాసంస్థల ఏర్పాటుతో కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. స్థానిక విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని స్థాయిల్లో విద్యా సదుపాయాలు అందుబాటులోకి తీసుకొస్తున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే బాధ్యతను ప్రజా ప్రభుత్వం తీసుకుంటోందని తెలిపారు. కొడంగల్ ప్రాంత అభివృద్ధిలో సాగునీటి వసతులకు కూడా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కృష్ణా నది నుంచి జూరాల ప్రాంతం ద్వారా నీటిని ఎత్తిపోసి మక్తల్, నారాయణపేట, కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. వ్యవసాయానికి మాత్రమే కాక భవిష్యత్తులో ఏర్పాటు కానున్న పారిశ్రామిక సంస్థలకు కూడా నిరంతర నీటి సరఫరా ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. నీటి వసతి, విద్యా సదుపాయాలు, పారిశ్రామిక మౌలిక వసతులు సమాంతరంగా అభివృద్ధి చెందితే కొడంగల్ ప్రాంతం రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన అభివృద్ధి కేంద్రంగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. అర్హులైన పేదలకు సన్నబియ్యం పంపిణీ, 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకం వంటి వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. దేశంలో మరెక్కడా లేని విధంగా పేదల సంక్షేమం, విద్య, ఉపాధి, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కొడంగల్ ప్రాంత ప్రజలతో దీపావళి వేడుకల్లో పాల్గొనడంతోపాటు వారి జీవితాల్లో శాశ్వత వెలుగులు నింపేలా వేల కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రివర్గ సహచరుల తరఫున, ప్రజల తరఫున అభినందనలు తెలియజేస్తున్నానని భట్టి విక్రమార్క అన్నారు. ముఖ్యమంత్రి సంకల్పం రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేస్తుందని స్పష్టం చేశారు.

రెండో విడత జనగణనకు షెడ్యూల్ ఖరారు!

- రెండో విడత జనాభా లెక్కింపునకు షెడ్యూల్ విడుదల
- జనవరి 10 నుంచి 24 వరకు స్వీయ నమోదుకు అవకాశం
- జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఇంటింటి సర్వే
- మార్చి 1 నుంచి 5 వరకు తప్పులు, మార్పుల సవరణ
- 2027 మార్చి 1 అర్ధరాత్రే జనగణనకు ప్రామాణిక సమయం
- జీఓ 155 జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. అధికారులకు కీలక ఆదేశాలు



హైదరాబాద్, నవంబర్ 9 (చురకలు): తెలంగాణలో జనగణన–2027 రెండో విడత నిర్వహణకు ముహూర్తం ఖరారైంది. రాష్ట్రవ్యాప్తంగా జనాభా లెక్కింపు చేపట్టేందుకు ప్రభుత్వం అధికారిక షెడ్యూల్‌ను ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 10 నుంచి స్వీయ నమోదు ప్రక్రియ ప్రారంభం కానుం డగా, జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. అనంతరం మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు వివరాల్లో తప్పులు, మార్పులను సరిచేసేందుకు అవకాశం కల్పించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ జీఓ నంబర్ 155ను జారీ చేసింది. కేంద్ర హోంశాఖ పరిధిలోని రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ కార్యాలయం అక్టోబర్ 30న విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్తర్వులను రాష్ట్ర గెజెట్‌లో పునఃప్రచురించింది. జనగణనను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని జిల్లాల్లో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. జనగణన ప్రక్రియలో భాగంగా ప్రజలు తమ కుటుంబ, వ్యక్తిగత వివరాలను స్వయంగా నమోదు చేసుకునేందుకు ప్రత్యేక అవకాశం కల్పించారు. జనవరి 10 నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో స్వీయ నమోదు చేసుకోవచ్చు. ఇంటింటి సర్వే ప్రారంభానికి ముందే తమ వివరాలను నమోదు చేసుకునేందుకు ఈ సదుపాయం ఉపయోగపడనుంది. డిజిటల్ విధానంలో జనాభా లెక్కింపును నిర్వహించడంలో భాగంగా ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. స్వీయ నమోదు ప్రక్రియ ముగిసిన వెంటనే జనవరి 25 నుంచి క్షేత్రస్థాయిలో జనాభా లెక్కింపు ప్రారంభం కానుంది. ఇందుకోసం నియమించిన గణకులు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించనున్నారు. ఈ ప్రక్రియ ఫిబ్రవరి 28 వరకు కొనసాగనుంది. రాష్ట్రంలోని పట్టణాలు, గ్రామాలు, మారుమూల ప్రాంతాల్లోనూ జనాభా లెక్కింపును సమగ్రంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టనున్నారు. ఇంటింటి సర్వే పూర్తయిన తర్వాత నమోదైన వివరాల్లో పొరపాట్లు, మార్పులు, మిగిలిపోయిన సమాచారాన్ని సరిచేసేందుకు ప్రత్యేక గడువు కేటాయించారు. మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. జనాభా లెక్కింపులో ఎలాంటి వివరాలు మిగిలిపోకుండా చూడటంతోపాటు సేకరించిన సమాచారంలో అవసరమైన సవరణలు చేపట్టేందుకు ఈ గడువు ఉపయోగపడనుంది. జనగణన–2027లో అత్యంత కీలకమైన ప్రామాణిక తేదీని కూడా ప్రభుత్వం ఖరారు చేసింది. 2027 మార్చి 1వ తేదీ అర్ధ రాత్రి 12 గంటలను జనాభా లెక్కింపునకు ప్రాతిపదికగా నిర్ణయించింది. ఆ సమయానికి సంబంధించిన జనాభా వివరాలను అధికారిక లెక్కల్లో పరిగణనలోకి తీసుకోనున్నారు. దేశవ్యాప్తంగా జనాభా గణనలో ఏకరూపత ఉండేలా ఈ ప్రామాణిక సమయాన్ని నిర్దేశించారు. జనగణన ప్రక్రియను మరింత సమర్థంగా నిర్వహించేందుకు డిజిటల్ విధానానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రజలు స్వయంగా వివరాలను నమోదు చేసుకునే సదుపాయంతోపాటు క్షేత్రస్థాయిలో సమాచార సేకరణను సులభతరం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. జనాభా లెక్కింపులో పారదర్శకత, కచ్చితత్వం ఉండేలా అవసరమైన సాంకేతిక ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం సూచించింది. గణకులకు అవసరమైన శిక్షణ, సాంకేతిక సహాయం, క్షేత్రస్థాయి సమన్వయంపై అధికారులు దృష్టి సారించనున్నారు. జనగణన నిర్వహణలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జీహెచ్ఎంసీ కమిషనర్, అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేసింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సర్వే నిర్వహణకు అవసరమైన సిబ్బంది, ఇతర ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించింది. నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం జనాభా లెక్కింపును పూర్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుందని పేర్కొంది. జనాభా లెక్కింపు ప్రభుత్వ విధానాల రూపకల్పనలో అత్యంత కీలకమైన ప్రక్రియ. జనాభా పెరుగుదల, కుటుంబాల సంఖ్య, సామాజిక, ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన సమాచారాన్ని విశ్లేషించేందుకు జనగణన వివరాలు ఉపయోగపడతాయి. విద్య, వైద్యం, గృహనిర్మాణం, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల ప్రణాళికలకు జనాభా గణాంకాలు ముఖ్యమైన ఆధారంగా నిలుస్తాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో రెండో విడత జనగణనను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

అండాల విక్రయ దందాపై మహిళా కమిషన్ ఆగ్రహం

- 50 మంది యువతులు బాధితులుగా గుర్తింపు



హైదరాబాద్, నవంబర్ 9 (చురకలు): తెలంగాణలో ఫెర్టిలిటీ సెంటర్లకు సంబంధించి వెలుగుచూసిన అండాల విక్రయ వ్యవహారంపై రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. పేదరికాన్ని ఆసరాగా చేసుకుని యువతులను మోసగించి, వారి అండాలను సేకరిస్తున్న ముఠాతో పాటు ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న ఫెర్టిలిటీ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేస్తామని కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద స్పష్టం చేశారు. గర్భధారణ వంటి సున్నితమైన అంశాన్ని అక్రమ సంపాదనకు మార్గంగా మార్చుకోవడం ఆందోళనకరమని ఆమె పేర్కొన్నారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగంలో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న యువతులకు ముఠా వల వేసినట్లు శారద వెల్లడించారు. సులభంగా డబ్బు సంపాదించవచ్చని నమ్మించి, ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున చెల్లిస్తామని చెప్పి అండాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 50 మంది బాధితులను గుర్తించగా, వారు ఆరు రాష్ట్రాలకు చెందినవారని వివరించారు. వీరిలో 90 శాతం మంది పెళ్లికాని యువతులే ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోందన్నారు. గత 15 రోజులుగా యువతులను హాస్టళ్లలో ఉంచినప్పటికీ వారికి ఎలాంటి డబ్బులు చెల్లించలేదని మహిళా కమిషన్ విచారణలో గుర్తించింది. ముఠా కార్యకలాపాలు బయటపడకుండా బాధితుల ఆధార్ కార్డుల్లో పేర్లు, చిరునామాలను సైతం మార్చినట్లు శారద ఆరోపించారు. రెండు నెలల గర్భంతో ఉన్న ఓ యువతికి ఆసుపత్రిలో చికిత్స అందించి అబార్షన్ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇందుకు బాధ్యులైన ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో హుస్సేన్ అనే వ్యక్తి కీలక పాత్ర పోషించినట్లు పేర్కొంటూ అతడిని వెంటనే అరెస్టు చేయాలని పోలీసులకు సూచించారు. ఈ కేసులో భాగంగా శారద, నర్మద, ఓవాసిస్, ఏఆర్టీ, ఇందిరా ఫెర్టిలిటీ సెంటర్లలో కమిషన్ విచారణ జరిపినట్లు నేరెళ్ల శారద తెలిపారు. విచారణకు హాజరుకావాలని ఆదేశించినప్పటికీ ఆయా కేంద్రాల యజమానులు రాకుండా సాధారణ ఉద్యోగులను పంపించారని ఆమె ఆక్షేపించారు. కమిషన్ అడిగిన ప్రశ్నలకు ఉద్యోగులు సమాధానాలు చెప్పలేకపోయారని, రికార్డుల్లోనూ పేర్ల నమోదు సక్రమంగా లేదని వెల్లడించారు. ఫెర్టిలిటీ కేంద్రాల ఛైర్మన్లు లేదా మేనేజింగ్ డైరెక్టర్లు మాత్రమే విచారణకు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు శారద తెలిపారు. ఈ మేరకు నవంబర్ 13న మరోసారి విచారణకు రావాలని నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఇంకా ఎన్ని ఫెర్టిలిటీ కేంద్రాలు ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నాయో తెలుసుకునేందుకు పోలీసుల నుంచి సమగ్ర నివేదిక తెప్పించుకుంటామన్నారు. కమిషన్ పరిధిలో పూర్తిస్థాయి విచారణ జరిపి, ఆధారాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని, బాధ్యులపై కఠిన చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేస్తామని స్పష్టం చేశారు.

షేక్‌పేట్‌లో వ్యభిచారం ముసుగులో డ్రగ్స్ దందా

- అటవీ సంపదతోపాటు ఆదివాసీల జీవనోపాధికి ప్రాధాన్యం
- అటవీ, పర్యావరణ శాఖ స్పెషల్ సీఎస్‌తో మంత్రి సీతక్క సమీక్ష

హైదరాబాద్: వ్యభిచార కార్యకలాపాల మాటున సింథటిక్ డ్రగ్స్ విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును తెలంగాణ ఈగల్ ఫోర్స్, సైబరాబాద్ కమిషనరేట్ పోలీసులు రట్టు చేశారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని షేక్‌పేట్ పోచమ్మ బస్తీలో ఓ ఇంటిపై సంయుక్తంగా దాడి చేసి డ్రగ్స్ సరఫరా చేస్తున్న బంగ్లాదేశ్ మహిళ ఆల్ఫాతో పాటు ఆమె లివ్ ఇన్ పార్ట్‌నర్ శ్యామ్‌రావును అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సింథటిక్ డ్రగ్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో వ్యభిచార కార్యకలాపాలు, డ్రగ్స్ సరఫరా, నకిలీ గుర్తింపు పత్రాల వినియోగానికి సంబంధించిన పలు వివరాలు వెల్లడయ్యాయి. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాకు చెందిన ఆల్ఫా కుటుంబ సమస్యలతోపాటు కరోనా సమయంలో గార్మెంట్ పరిశ్రమలో ఉద్యోగం కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంది. ఉపాధి కోసం 2021 డిసెంబర్‌లో టూరిస్ట్ వీసాపై భారత్‌కు వచ్చింది. ఇక్కడ ఉద్యోగం లభించకపోవడంతో ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన ఉత్తరప్రదేశ్‌కు చెందిన నూర్ ఆమె పరిస్థితిని ఆసరాగా చేసుకున్నాడు. వ్యభిచారం ద్వారా అధిక మొత్తంలో సంపాదించవచ్చని నమ్మించి ఆ కార్యకలాపాల్లోకి దింపినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం చెన్నైకి చెందిన రాహుల్, హైదరాబాద్‌కు చెందిన జే, జేకే అనే బ్రోకర్లతో ఆమెకు పరిచయాలు ఏర్పడ్డాయి. వారి సూచనల మేరకు హైదరాబాద్‌తోపాటు నాగ్‌పూర్, కాన్పూర్, విజయవాడ, విశాఖపట్నం, భువనేశ్వర్, గోవా, ముంబై తదితర నగరాలకు వెళ్లి వ్యభిచారం చేసేది. ఈ కార్యకలాపాల ద్వారా నెలకు సుమారు రూ.75 వేల వరకు సంపాదించేదని విచారణలో వెల్లడైంది. 2021లో హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్యామ్‌రావు (35)తో ఆల్ఫాకు పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారడంతో 2022 నుంచి ఇద్దరూ షేక్‌పేట్‌లో సహజీవనం చేస్తున్నారు. ఆమె కోసం శ్యామ్‌రావు బంగ్లాదేశ్‌కు కూడా వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. వీరి సంబంధం గురించి తెలిసిన తర్వాత శ్యామ్‌రావు మొదటి భార్య అతడికి దూరమైనట్లు సమాచారం. అయితే శ్యామ్‌రావు ఉద్యోగానికి వెళ్లిన సమయంలో అతడికి తెలియకుండా ఆల్ఫా ఇంట్లోనే వ్యభిచార కార్యకలాపాలు నిర్వహించేది. ఈ క్రమంలో కస్టమర్ల ప్రభావంతో ఆమె సింథటిక్ డ్రగ్స్‌కు అలవాటు పడింది. గోవాకు చెందిన ఆకాష్ అనే డ్రగ్ పెడ్లర్ నుంచి డెడ్‌డ్రాప్ పద్ధతిలో తరచూ మాదకద్రవ్యాలను తెప్పించుకునేది. భారతీయురాలిగా చలామణి అయ్యేందుకు ఆల్ఫా, జియా శ్యామ్‌రావు పేరుతో నకిలీ ఆధార్, పాన్ కార్డులను సృష్టించినట్లు పోలీసులు వెల్లడించారు. వీటి ఆధారంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఖాతా తెరిచి డ్రగ్స్ కొనుగోళ్లకు, అక్రమంగా సంపాదించిన డబ్బును దాచుకునేందుకు ఉపయోగించేది. డ్రగ్స్ విక్రయాల్లో అధిక లాభాలు వస్తుండటంతో తన పరిచయస్తులతోపాటు క్రమం తప్పకుండా వచ్చే కస్టమర్లకు కూడా సింథటిక్ డ్రగ్స్ సరఫరా చేయడం ప్రారంభించింది. ఆమెతో కలిసి ఉంటున్న శ్యామ్‌రావు సైతం డ్రగ్స్‌కు బానిసైనట్లు విచారణలో వెల్లడైంది. గోవా నుంచి భారీగా సింథటిక్ డ్రగ్స్ తీసుకుని ఆల్ఫా హైదరాబాద్‌కు చేరుకున్నట్లు ఈగల్ ఫోర్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో రాయదుర్గం పోలీసులతో కలిసి షేక్‌పేట్‌లోని ఆమె నివాసంపై దాడి చేశారు. ఈ సందర్భంగా ఆల్ఫా, శ్యామ్‌రావులను అదుపులోకి తీసుకుని డ్రగ్స్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. డ్రగ్స్ సరఫరా వెనుక ఉన్న గోవా పెడ్లర్ ఆకాష్, వివిధ నగరాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న బ్రోకర్లు, అంతర్రాష్ట్ర నెట్‌వర్క్ వివరాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

అన్ని వైద్య సేవలు జిల్లాల్లోనే..

- సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థను బలోపేతం చేస్తాం
- ఏరియా హాస్పిటల్స్, హెల్త్ సెంటర్లలో సదుపాయాల కల్పన
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్




హైదరాబాద్, నవంబర్ 9 (చురకలు): రాష్ట్రంలోని ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు వారి జిల్లాల్లోనే అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్లు, జిల్లా హాస్పిటళ్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఇందుకనుగుణంగా ఈ హాస్పిటళ్లలో మౌలిక సదుపాయాలు, స్పెషలిస్ట్ వైద్య సేవలు, అవసరమైన వైద్య సిబ్బంది, డయాగ్నస్టిక్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని మంత్రి తెలిపారు. సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా రోగులు చిన్న సమస్యలకు కూడా హైదరాబాద్, మెడికల్ కాలేజీ హాస్పిటళ్లకు వెళ్లే పరిస్థితి తగ్గుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ మేరకు సెక్రటేరియట్‌లో డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ (తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) పునర్వ్యవస్థీకరణపై సోమవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి మాట్లాడారు. డీఎస్‌హెచ్ పునర్వ్యవస్థీకరణపై అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా రూపొందించిన అధ్యయన నివేదికలోని ప్రతిపాదనలను మంత్రి సమీక్షించారు. డీఎస్‌హెచ్ పరిధిలోని హాస్పిటళ్లలో ఇటీవలే 1,616 మంది స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించామని, అవసరమైన మేర నర్సులు, టెక్నీషియన్ల నియామకాలు కూడా చేపట్టామని మంత్రి గుర్తుచేశారు. ప్రభుత్వం చేపట్టిన ఈ నియామకాల ఫలితాలు ప్రజలకు అందాలంటే ప్రతి హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్న సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఏ హాస్పిటల్‌లో ఏ స్పెషలిస్ట్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.. ఇంకా ఏయే విభాగాల్లో వైద్యులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది అవసరం ఉంది.. ఏయే వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ సదుపాయాలు కల్పించాల్సి ఉంది అనే అంశాలపై హాస్పిటల్ వారీగా సమగ్ర సమీక్ష చేపట్టాలని ఆదేశించారు. స్పెషలిస్టులు ఉన్నప్పటికీ అవసరమైన పరికరాలు, సిబ్బంది లేక వైద్య సేవలు అందించలేని పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. 30 పడకలు, 50 పడకలు, 100 పడకలు, అంతకంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన హాస్పిటళ్లకు వాటి స్థాయికి అనుగుణంగా వైద్య సేవల పరిధిని నిర్ణయించాలని మంత్రి సూచించారు. సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటళ్లు, జిల్లా హాస్పిటళ్లలో అందుబాటులో ఉండాల్సిన స్పెషాలిటీ విభాగాలు, వైద్య సేవలు, పడకలు, ఆపరేషన్ థియేటర్లు, ల్యాబ్‌లు, ఇతర సదుపాయాలపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. సెకండరీ హెల్త్ కేర్ హాస్పిటళ్లను కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ మార్గదర్శకాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం ఉన్న సిబ్బంది, మంజూరైన పోస్టులు, ఐపీహెచ్ఎస్ ప్రమాణాల ప్రకారం అవసరమైన సిబ్బంది సంఖ్యను పోల్చి చూసి లోటుపాట్లను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే ఉన్న పోస్టులను అవసరాలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించడంతోపాటు, అదనంగా అవసరమైన పోస్టులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్(డీసీహెచ్ఎస్) కార్యాలయాలను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను సమీక్షించిన మంత్రి రాష్ట్రస్థాయి డైరెక్టరేట్ నుంచి జిల్లాస్థాయి వరకు స్పష్టమైన పరిపాలనా బాధ్యతలు ఉండాలని సూచించారు. ప్రతి జిల్లాలోని హాస్పిటళ్ల పనితీరు, వైద్య సేవల నాణ్యత, మౌలిక సదుపాయాల అభివృద్ధిని నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు. హాస్పిటళ్లలో రోగులకు ఎదురవుతున్న సమస్యలు, వైద్య సేవల్లో లోటుపాట్లు, సిబ్బంది అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేలా జిల్లాస్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. సమావేశంలో ప్రముఖ ఆంకాలజిస్ట్, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, జీవీడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మహేశ్ దత్ ఎక్కా, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్. చొంగ్తు, ఆర్థికశాఖ స్పెషల్ సెక్రటరీ సిక్తా పట్నాయక్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ముషారఫ్ అలీ, ఆస్కి డైరెక్టర్ డాక్టర్ సుబోధ్ తదితరులు పాల్గొన్నారు.

బతికున్నోళ్ల పేరిట డెత్ సర్టిఫికెట్లు

- ప్రభుత్వ డిజిటల్ కీని ప్రైవేట్ వ్యక్తికి విక్రయించిన పంచాయతీ కార్యదర్శి
- హైదరాబాద్ ఇంటర్నెట్ సెంటర్ నుంచి నకిలీ సర్టిఫికెట్ల తయారీ
- 2026 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు 22 నకిలీ ధ్రువీకరణ పత్రాలు
- ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లతో లక్షల రూపాయలు కాజేసినట్లు ఆరోపణలు

సిద్దిపేట, నవంబర్ 9(చురకలు): బతికున్న వ్యక్తులను మరణించినట్లు రికార్డుల్లో చూపించి, నకిలీ డెత్ సర్టిఫికెట్ల ఆధారంగా ఇన్సూరెన్స్ సొమ్మును కాజేసిన మోసం సిద్దిపేట జిల్లాలో వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం, ప్రైవేట్ వ్యక్తుల అక్రమ వ్యవహారాలు కలిసి ఈ కుంభకోణానికి దారితీసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ప్రభుత్వ డిజిటల్ సంతకం కోసం వినియోగించే ఈ-సైన్ డాంగిల్‌ను ప్రైవేట్ వ్యక్తికి అప్పగించడమే ఈ అక్రమాలకు ప్రధాన కారణంగా భావిస్తున్నారు. చేర్యాల మండలం రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన భూక్య మధు ప్రభుత్వానికి చెందిన ఈ-సైన్ డాంగిల్‌ను హైదరాబాద్‌కు చెందిన రమేష్ అనే వ్యక్తికి విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు ప్రతిఫలంగా మధుకు భారీగా ముడుపులు అందినట్లు సమాచారం. ప్రభుత్వ అధికారిక డిజిటల్ సంతకాన్ని ప్రైవేట్ వ్యక్తి వినియోగించుకునేలా చేయడంతో నకిలీ ధ్రువీకరణ పత్రాల తయారీకి అవకాశం ఏర్పడింది. ఆ డిజిటల్ సంతకాన్ని ఉపయోగించి హైదరాబాద్‌లో ఇంటర్నెట్ సెంటర్ నిర్వహిస్తున్న రమేష్ నకిలీ డెత్ సర్టిఫికెట్లు రూపొందించినట్లు విచారణలో గుర్తించారు. 2026 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు 22 నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలు తయారు చేసినట్లు తేలింది. కుటుంబ సభ్యుల పేర్లతో భారీగా ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకుని, వారు జీవించి ఉండగానే మరణించినట్లు ధ్రువీకరణ పత్రాలు సృష్టించినట్లు సమాచారం. వాటిని ఉపయోగించి ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు సమర్పించి లక్షలాది రూపాయలు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారం ఆలస్యంగా బయటపడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎంపీఓ ఈ ఘటనపై చేర్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పంచాయతీ కార్యదర్శి భూక్య మధు, ఇంటర్నెట్ సెంటర్ నిర్వాహకుడు రమేష్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కుంభకోణంలో మరెవరైనా భాగస్వాములుగా ఉన్నారా? ఇప్పటివరకు ఎంత మొత్తంలో ఇన్సూరెన్స్ సొమ్ము కాజేశారు? అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.



ప్రైవేట్ పాఠశాలల్లో 'ప్రశస్త్' స్క్రీనింగ్ తప్పనిసరి

- 3 నుంచి 18 ఏళ్ల పిల్లల్లో అభ్యాసన లోపాలు, దివ్యాంగత్వాల గుర్తింపు
- ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పోర్టల్‌లో నమోదు కావాలి
- అర్హులైన విద్యార్థులందరికీ స్క్రీనింగ్ పూర్తి చేయాలని ఆదేశం
- నిర్లక్ష్యం చేస్తే పాఠశాలల యాజమాన్యాలదే బాధ్యత

హైదరాబాద్, నవంబర్ 9 (చురకలు): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రత్యేక అభ్యాసన సమస్యలు, దివ్యాంగత్వాలను తొలిదశలోనే గుర్తించి అవసరమైన సహాయం అందించేందుకు తెలంగాణ పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో 'ప్రశస్త్' స్క్రీనింగ్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా రూపొందించిన ఈ విధానాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. 'ప్రశస్త్' అనేది 3 నుంచి 18 ఏళ్ల వయస్సున్న పిల్లల్లో వివిధ రకాల దివ్యాంగత్వాలు, శారీరక, మానసిక అభ్యాసన లోపాలను ముందుగానే గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన స్క్రీనింగ్ సాధనం. దీని ద్వారా విద్యార్థుల్లోని సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి, వారికి తగిన విద్యా సహాయం, వైద్య సదుపాయాలు అందించే అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమం అమలుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ప్రైవేట్ పాఠశాలలకు మార్గదర్శకాలు జారీ చేశారు. యూడీఐఎస్ఈ+ రికార్డుల్లో నమోదైన ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు తప్పనిసరిగా 'ప్రశస్త్' పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది సైతం ప్రిన్సిపాల్ లాగిన్ ద్వారా నిర్దేశించిన అవగాహన కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం అర్హులైన విద్యార్థులందరికీ నిర్ణీత గడువులోగా స్క్రీనింగ్ నిర్వహించాలి. ఈ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పూర్తిస్థాయిలో సహకరించాలని విద్యాశాఖ సూచించింది. ఆదేశాలను పాటించకపోయినా, విద్యార్థుల స్క్రీనింగ్‌ను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయకపోయినా సంబంధిత పాఠశాలల యాజమాన్యాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను ముందుగానే గుర్తించి, వారి విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేసింది.

బియ్యం ధరలకు కళ్లెం

- రకాలను బట్టి గరిష్ట ధరలు ఖరారు
- బీపీటీ, కేఎన్ఎం కిలో రూ.66కు మించకూడదు
- ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా ధర రూ.74గా నిర్ణయం
- హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకాల గరిష్ట ధర రూ.79
- అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌పై పీడీ యాక్ట్

హైదరాబాద్, నవంబర్ 9 (చురకలు): రాష్ట్రంలో పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మార్కెట్‌లో బియ్యం కొరత ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని పౌరసరఫరాల శాఖ ఖండించింది. కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచుతున్న వ్యాపారులపై నిఘా పెట్టడంతో పాటు వివిధ రకాల బియ్యం విక్రయాలకు గరిష్ట ధరలను నిర్ణయించింది. నిర్ణయించిన ధరలకు మించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. రకాలను బట్టి కిలో బియ్యం గరిష్ట ధరలను ప్రభుత్వం ఖరారు చేసింది. బీపీటీ, కేఎన్ఎం రకాల ధర కిలోకు రూ.66గా నిర్ణయించింది. ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా బియ్యం కిలో రూ.74కు మించి విక్రయించకూడదని ఆదేశించింది. హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకాల గరిష్ట ధరను రూ.79గా నిర్ధారించింది. ఈ ధరల కంటే అధికంగా వసూలు చేసే వ్యాపారులపై చర్యలు తప్పవని హెచ్చరించింది. బియ్యం విక్రయాల్లో జరుగుతున్న అక్రమాలపైనా పౌరసరఫరాల శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. 25 కిలోల బస్తాపై 26 కిలోలుగా పేర్కొంటూ స్టిక్కర్లు వేసి విక్రయించడం, అసలు ధర కంటే ఎక్కువ మొత్తం చూపించే నకిలీ ఎంఆర్పీ స్టిక్కర్లను అతికించడం వంటి మోసాలను గుర్తించేందుకు తనిఖీలు చేపట్టింది. అక్రమంగా బియ్యం నిల్వ చేసినా, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. పదేపదే నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. రిటైల్ వ్యాపారులకు బియ్యం కొరత రాకుండా సరఫరా వ్యవస్థలోనూ మార్పులు చేపట్టింది. ఇకపై హోల్‌సేల్ వ్యాపారులపై ఆధారపడకుండా రిటైలర్లు నేరుగా రైస్ మిల్లర్ల నుంచే బియ్యం కొనుగోలు చేసేలా అవకాశం కల్పించింది. ఎక్కడైనా నిల్వలు అందుబాటులో లేకపోతే వెంటనే సంబంధిత జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్ఓ)కు ఇండెంట్ ఇవ్వాలని సూచించింది. నిర్ణయించిన ధరలు, ఇతర నిబంధనలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయో లేదో పరిశీలించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బృందాలతో తనిఖీలు ముమ్మరం చేసింది.



సంపాదకీయం



ఓడిన ట్రంప్..

ఇరాన్‌పై దూకుడు తగ్గేనా?

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లకు భారీ ఎదురుదెబ్బ

కాంగ్రెస్ ఉభయ సభల్లో డెమోక్రాట్ల ఆధిపత్యానికి మార్గం

జనవరి వరకు ట్రంప్‌నకు రెండు నెలల కీలక అవకాశం

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఎదురైన భారీ పరాజయం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాజకీయ భవిష్యత్తుతోపాటు ఆయన విదేశాంగ విధానంపైనా ప్రభావం చూపనుందా? ముఖ్యంగా ఇరాన్‌పై ఇప్పటివరకు అనుసరిస్తున్న కఠిన వైఖరిని కొనసాగిస్తారా? లేక కాంగ్రెస్‌లో మారనున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో దూకుడు తగ్గించి దౌత్య చర్చలకు ప్రాధాన్యం ఇస్తారా? అన్న ప్రశ్నలు అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు ప్రతినిధుల సభ, సెనెట్‌లో ఆధిక్యం సాధించడంతో రానున్న రెండేళ్లలో ట్రంప్ ప్రభుత్వానికి కాంగ్రెస్ నుంచి గట్టి పర్యవేక్షణ ఎదురయ్యే అవకాశముంది. అయితే కొత్తగా ఎన్నికైన సభ్యులు 2027 జనవరిలో బాధ్యతలు చేపట్టే వరకు ప్రస్తుత కాంగ్రెస్ కొనసాగనుంది. దీంతో ఈ రెండు నెలల వ్యవధిలో ట్రంప్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. అమెరికా రాజకీయ వ్యవస్థలో ఎన్నికలు ముగిసినప్పటికీ కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు బాధ్యతలు చేపట్టే వరకు ఉండే మధ్యంతర కాలాన్ని 'లేమ్ డక్' కాలంగా వ్యవహరిస్తారు. ఈ సమయంలో పాత కాంగ్రెస్ తన అధికారాలను కొనసాగిస్తుంది. నవంబర్‌లో ఎన్నికలు జరిగినా కొత్త కాంగ్రెస్ జనవరి 3న సమావేశమవుతుంది. అప్పటివరకు ప్రస్తుత సభ్యులకే శాసన అధికారాలు ఉంటాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం తన ప్రాధాన్య కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించే అవకాశముంది. అయితే కొత్త కాంగ్రెస్ ఏర్పడిన తర్వాత బడ్జెట్, ప్రభుత్వ వ్యయాలు, అధికారుల విచారణలు, శాసనపరమైన అంశాల్లో డెమోక్రాట్ల పాత్ర కీలకంగా మారనుంది.

ట్రంప్ ఎదుట ఇరాన్ సవాల్

ఇరాన్‌తో అమెరికా సంబంధాలు ఇప్పటికే తీవ్ర ఉద్రిక్తతల మధ్య కొనసాగుతున్నాయి. ఇరాన్ అణు కార్యక్రమం, ప్రాంతీయ భద్రత, గల్ఫ్ దేశాల ప్రయోజనాలు, అంతర్జాతీయ చమురు రవాణా వంటి అంశాలు అమెరికా విదేశాంగ విధానంలో కీలకంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ట్రంప్ ఇరాన్‌పై సైనిక ఒత్తిడిని కొనసాగిస్తారా? లేక దౌత్యపరమైన పరిష్కారానికి ప్రయత్నిస్తారా? అన్నది ప్రధాన ప్రశ్నగా మారింది. ఇరాన్‌పై మరింత సైనిక చర్య చేపట్టడం ఒక అవకాశంగా కొందరు విశ్లేషకులు ప్రస్తావిస్తున్నప్పటికీ, అలాంటి నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక ధ్రువీకరణ లేదు. అంతేకాకుండా సైనిక చర్యలు విస్తరిస్తే పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే ప్రమాదముంది. ఇరాన్‌పై అమెరికా దాడులు తీవ్రతరం చేస్తే టెహ్రాన్ ప్రతిస్పందన ఎలా ఉంటుందన్నది కూడా కీలకమే. గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలు, మిత్రదేశాల భద్రత, చమురు రవాణా మార్గాలపై ప్రభావం పడే అవకాశాలను అమెరికా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా హర్ముజ్ జలసంధి ద్వారా జరిగే చమురు రవాణాకు అంతరాయం ఏర్పడితే అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై ప్రభావం చూపవచ్చు. మరోవైపు మధ్యంతర ఎన్నికల ఫలితాలను ఇరాన్ తనకు రాజకీయంగా అనుకూలమైన పరిణామంగా భావించే అవకాశమున్నప్పటికీ, ఆ కారణంగానే చర్చల్లో ఎలాంటి రాయితీలు ఇవ్వబోదని నిర్ధారించలేం. ఇరు దేశాల తదుపరి చర్యలపైనే పరిస్థితి ఆధారపడి ఉంటుంది. ఇరాన్‌పై అత్యంత శక్తిమంతమైన సంప్రదాయ బాంబులు లేదా అణ్వాయుధాల వినియోగం గురించి కొన్ని విశ్లేషణల్లో తీవ్రమైన అవకాశాలు ప్రస్తావనకు వస్తున్నాయి. అయితే అణ్వాయుధ దాడికి అమెరికా సిద్ధమవుతోందని నిర్ధారించే అధికారిక ఆధారాలు లేవు. అలాంటి చర్య అంతర్జాతీయంగా తీవ్రమైన పరిణామాలకు దారితీస్తుంది. అందువల్ల సైనిక చర్యలపై వస్తున్న ఊహాగానాలను అమెరికా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలుగా పరిగణించరాదు. ఇరాన్‌తోపాటు క్యూబా విషయంలోనూ ట్రంప్ ప్రభుత్వం ఎలాంటి వైఖరి అవలంబిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా హయాంలో క్యూబాతో సంబంధాలను మెరుగుపరిచేందుకు అమెరికా ప్రయత్నించింది. అయితే ట్రంప్ విధానాలు అందుకు భిన్నంగా సాగాయి. ఆర్థిక సంక్షోభంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్యూబాపై ఆంక్షలను మరింత కఠినతరం చేస్తారా? లేక ఆర్థిక ఒప్పందాల ద్వారా తన ప్రయోజనాలను సాధించేందుకు ప్రయత్నిస్తారా? అన్నది చూడాల్సి ఉంది. క్యూబాలో పాలన మార్పు లక్ష్యంగా అమెరికా సైనిక చర్య చేపడుతుందనే ఊహాగానాలు ఉన్నప్పటికీ, అలాంటి నిర్ణయానికి సంబంధించి స్పష్టమైన అధికారిక సమాచారం లేదు. ఆర్థిక ఆంక్షలు, దౌత్య ఒత్తిడి, పరిమిత చర్చలు వంటి మార్గాలు కూడా అమెరికా ముందున్నాయి. డెమోక్రాట్లు కాంగ్రెస్‌లో ఆధిపత్యం సాధించినంత మాత్రాన అధ్యక్షుడి విదేశాంగ అధికారాలన్నీ రద్దవుతాయని భావించలేం. అమెరికా అధ్యక్షుడికి విదేశాంగ విధానం, సైనిక వ్యవహారాల్లో గణనీయమైన అధికారాలు ఉన్నాయి. అయితే యుద్ధానికి సంబంధించిన నిధుల కేటాయింపు, ప్రభుత్వ వ్యయాల ఆమోదం, అధికారుల నుంచి వివరణలు కోరడం, విచారణలు చేపట్టడం వంటి అంశాల్లో కాంగ్రెస్ కీలక పాత్ర పోషించగలదు. దీంతో కొత్త కాంగ్రెస్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రంప్ నిర్ణయాలపై ప్రశ్నలు, విచారణలు పెరిగే అవకాశముంది. ముఖ్యంగా ఇరాన్‌తో ఘర్షణ, సైనిక వ్యయం, విదేశీ జోక్యాలపై డెమోక్రాట్లు మరింత కఠినంగా వ్యవహరించవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మధ్యంతర ఎన్నికల ఫలితాలు ట్రంప్ ప్రభుత్వానికి రాజకీయంగా ప్రతికూల పరిస్థితులను సృష్టించినప్పటికీ, విదేశాంగ విధానంలో ఆయన తదుపరి నిర్ణయాలను ఇప్పుడే అంచనా వేయడం కష్టం. సైనిక ఒత్తిడిని కొనసాగించడం, పరిమిత చర్యలకు దిగడం, చర్చల ద్వారా ఒప్పందాలకు ప్రయత్నించడం వంటి మార్గాలు అమెరికా ముందున్నాయి. మొత్తానికి మధ్యంతర ఎన్నికల్లో ఎదురైన పరాజయం ట్రంప్ రాజకీయ అధికారాలకు కొత్త సవాళ్లు విసిరింది. అయితే ఈ పరిణామం ఇరాన్‌పై అమెరికా దూకుడును తగ్గిస్తుందా? లేక మరింత కఠినమైన నిర్ణయాలకు దారితీస్తుందా? అన్నది రానున్న రెండు నెలల్లో ట్రంప్ అనుసరించే విధానంపైనే ఆధారపడి ఉంటుంది.

క్యాన్సర్ రోగులకు భారీ ఊరట!

- ఔషధాల ధరలకు గరిష్టంగా 96.45 శాతం వరకు కోత
- 137 రకాల మందులకు చెందిన 1,031 ఫార్ములేషన్ల ధరల సవరణ
- క్యాన్సర్ చికిత్సలో ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కేంద్రం చర్యలు
- దేశవ్యాప్తంగా సవరించిన ధరలు అమల్లోకి వచ్చినట్లు ప్రకటన
- కొత్త గరిష్ట చిల్లర ధరల ప్రకారమే మందులు విక్రయించాలని ఆదేశాలు
- మందుల ధరల వివరాలు ఎన్‌పీపీఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో



న్యూఢిల్లీ, నవంబర్ 9 (చురకలు): క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న రోగులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించే నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడైంది. క్యాన్సర్ చికిత్సలో వినియోగించే పలు ఔషధాల ధరలను గణనీయంగా తగ్గిస్తూ జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) ధరల సవరణను ప్రకటించినట్లు సమాచారం. ఈ నిర్ణయం ప్రకారం 137 రకాల ఔషధాలకు సంబంధించిన 1,031 ఫార్ములేషన్ల ధరలు గరిష్టంగా 96.45 శాతం వరకు తగ్గనున్నాయి. ఖరీదైన మందుల కొనుగోలుతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్యాన్సర్ రోగులు, వారి కుటుంబాలకు ఈ చర్య ఉపశమనం కలిగించే అవకాశముంది. క్యాన్సర్ చికిత్సలో వినియోగించే మందుల ధరలు సామాన్యులకు భారంగా మారుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఔషధ విభాగం పరిధిలోని ఎన్‌పీపీఏ ధరల సవరణకు చర్యలు చేపట్టినట్లు వెల్లడైంది. మొత్తం 137 రకాల ఔషధాలకు సంబంధించిన 1,031 ఫార్ములేషన్లపై ధరల సవరణ వర్తించనున్నట్లు పేర్కొన్నారు. వీటిలో కొన్ని ఔషధాల ధరలు గరిష్టంగా 96.45 శాతం వరకు తగ్గే అవకాశముంది. అయితే అన్ని మందుల ధరలు ఒకే శాతంలో తగ్గవని, ఒక్కో ఔషధానికి సవరించిన ధర వేర్వేరుగా ఉంటుందని గుర్తించాలి. క్యాన్సర్ చికిత్సలో మందుల ఖర్చు అనేక కుటుంబాలకు తీవ్ర ఆర్థిక భారంగా మారుతోంది. దీర్ఘకాలం పాటు చికిత్స అవసరమయ్యే రోగులు ఔషధాల కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో మందుల ధరలు తగ్గడం వల్ల ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రయోజనం చేకూరే అవకాశముంది. చికిత్స ఖర్చులను తగ్గించడంలో ఈ నిర్ణయం కీలకంగా మారవచ్చని భావిస్తున్నారు. సవరించిన ధరలు దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చినట్లు ఎన్‌పీపీఏ వెల్లడించిందని సమాచారం. సంబంధిత ఔషధాలను నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలకు మించి విక్రయించరాదని స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. మందుల దుకాణాలు, ఆసుపత్రులు, ఔషధ విక్రయ సంస్థలు అమల్లో ఉన్న ధరల నియంత్రణ ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. సవరించిన ధరల అమలు తేదీ, పాత నిల్వలపై వర్తించే నిబంధనలను సంబంధిత అధికారిక ఉత్తర్వుల ప్రకారం పరిశీలించాలి. క్యాన్సర్ రోగులు, వారి కుటుంబ సభ్యులు మందులు కొనుగోలు చేసే సమయంలో ఔషధం పేరు, మోతాదు, తయారీ సంస్థ, గరిష్ట చిల్లర ధరలను పరిశీలించడం అవసరం. ముఖ్యంగా ధరల సవరణ వర్తించే మందుల జాబితాలో తాము వినియోగిస్తున్న ఔషధం ఉందో లేదో తెలుసుకోవాలి. సవరించిన ధరల వివరాలను ఎన్‌పీపీఏ అధికారిక వెబ్‌సైట్ ద్వారా పరిశీలించవచ్చు. క్యాన్సర్ చికిత్సలో వైద్యసేవలతోపాటు ఔషధాల లభ్యత, వాటి ధరలు కూడా అత్యంత కీలకమైన అంశాలు. ఖరీదైన మందులు అందుబాటు ధరల్లో లభిస్తే రోగులకు చికిత్స కొనసాగించడం కొంత సులభమవుతుంది. ఔషధాల ధరల నియంత్రణ ద్వారా వైద్య ఖర్చులను తగ్గించే చర్యలు రోగుల సంక్షేమానికి దోహదపడే అవకాశముంది.

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై ఈసీ కసరత్తు

జనవరిలో మోగనున్న నగారా!



ఢిల్లీ, నవంబర్ 9: దేశంలోని ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు మరికొద్ది రోజుల్లో నగారా మోగనుంది. అందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) కసరత్తు చేపట్టింది. జనవరి మాసం ప్రథమ, ద్వితీయార్ధంలో ఈ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఫిబ్రవరి – మార్చి మాసాల్లో పోలింగ్ ప్రక్రియ పూర్తి చేసేలా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్, ఈవీఎంల తనిఖీలను ఎన్నికల సంఘం (ఈసీ) వేగవంతం చేసింది. ఎన్నికల కోడ్ అమల్లోకి రాక ముందే ఈ రాష్ట్రాల్లో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు జోరందుకున్నాయి. ఇక ఎన్నికల షెడ్యూల్ సంకేతాలతో ఆయా రాష్ట్రాల్లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అయితే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపుర్‌లలో అధికార పీఠాన్ని దక్కించుకోవాలని బీజేపీ పట్టుదలతో ఉంది. ఇక పంజాబ్‌లో మళ్లీ అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తన వంతు ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా పుంజుకోవాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. మరో వైపు ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలోని 403 సీట్లపైనే అందరి దృష్టి ఉంది. ఈ ఫలితాలు దేశ రాజధాని ఢిల్లీ రాజకీయాలను శాసిస్తాయనే చర్చ సాగుతోంది.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు ఆరుగురు సజీవదహనం!


యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం



ముజఫర్‌నగర్, నవంబర్ 9 (చురకలు): ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లా తితావి పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత ఘోరమైన రోడ్డు ప్రమాదం సంభవించింది. పానిపట్–ఖతిమా జాతీయ రహదారిపై జాగేహేడి సమీపంలో అతివేగంగా వెళ్తున్న కారు ఒక్కసారిగా అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని, డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన తీవ్రతకు కారు తలకిందులై వాహనంలో క్షణాల్లో భయంకరమైన మంటలు చెలరేగాయి. కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు బయటకు వచ్చే అవకాశం కూడా లేకపోవడంతో వాహనం ఆవరణలోనే చిక్కుకుని సజీవదహనమయ్యారు. హరియాణా నుంచి హరిద్వార్ వైపు ప్రయాణిస్తున్న సమయంలో తెల్లవారుజామున ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఢీకొట్టిన వెంటనే కారు ఫ్యూయల్ ట్యాంక్ పగిలిపోవడంతో మంటలు క్షణాల్లో కారు మొత్తాన్ని చుట్టుముట్టాయని పోలీసులు భావిస్తున్నారు. మంటల తీవ్రత ఎంతగా ఉందంటే.. కారులో ఉన్నవారంతా గుర్తుపట్టలేని రీతిలో పూర్తిగా కాలి బూడిదయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అధికారులకు సమాచారం అందించగా, పోలీసులు, ఫైర్ బ్రిగేడ్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కారులో కాలిపోయిన స్థితిలో ఉన్న ఆరుగురి మృతదేహాలను వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఫోరెన్సిక్ బృందం కూడా ప్రమాద స్థలాన్ని సందర్శించి నమూనాలు సేకరించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ముజఫర్‌నగర్ పోలీసులు మృతుల వివరాలను పూర్తిగా గుర్తించే పనిలో ఉన్నారు.

రాజకీయాలకు అతీతంగా నా ఆత్మకథ

- 'ప్రేమ, విధేయతే జీవిత ప్రయాణానికి ఆధారం'
- 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో పుస్తకం
- కుటుంబ అనుబంధాలు, వ్యక్తిగత అనుభవాలకు ప్రాధాన్యం
- ప్రజాస్వామ్య వ్యవస్థలకు గత 12 ఏళ్లలో నష్టం జరిగిందని వ్యాఖ్య
- బీజేపీ, ఆర్ఎస్ఎస్ నుంచి కాంగ్రెస్ నేర్చుకోవాల్సిందేమీ లేదన్న సోనియా



న్యూఢిల్లీ, నవంబర్ 9: కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తన రాబోయే ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఇది రాజకీయ అంశాలతో కూడిన పుస్తకం కాదని, తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనుభవాలు, కుటుంబ అనుబంధాలు, ప్రేమ, విధేయత వంటి అంశాలే ఇందులో ప్రధానంగా ఉంటాయని స్పష్టం చేశారు. ఓ జాతీయ దినపత్రికలో రాసిన వ్యాసంలో ఆమె ఈ విషయాలను పంచుకున్నారు. తన జీవితంలో చాలా వరకు వ్యక్తిగత విషయాలను బయటకు వెల్లడించలేదని సోనియా గాంధీ తెలిపారు. బహిరంగ జీవితంలోకి వచ్చిన తర్వాత కూడా సాధ్యమైనంత వరకు గోప్యతను కాపాడుకున్నానని పేర్కొన్నారు. తన జీవితాన్ని బహిరంగంగా అక్షరబద్ధం చేయాలనే ఆలోచన ఒకప్పుడు ఊహకు కూడా అందనిదిగా ఉండేదన్నారు. అయితే రాజకీయ, ప్రజా జీవితంలోని రోజువారీ హడావిడి నుంచి కొంత దూరమైన తర్వాత గతాన్ని నెమరువేసుకునే అవకాశం లభించిందని వివరించారు. తన జీవితాన్ని వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు అన్ని అనుభవాలను కలిపే ప్రధాన అంశం ప్రేమ, దాని నుంచి పుట్టిన విధేయత అని సోనియా గాంధీ పేర్కొన్నారు. ఇంగ్లాండ్‌లో ఓ చిన్న ఇటాలియన్ పట్టణానికి చెందిన 19 ఏళ్ల యువతిగా ఉన్నప్పుడు భారతీయ విద్యార్థిని కలవడంతో తన జీవిత ప్రయాణం కొత్త మలుపు తిరిగిందని గుర్తుచేసుకున్నారు. ఆ పరిచయం తనను కొత్త దేశానికి, కొత్త కుటుంబానికి తీసుకెళ్లిందన్నారు. అత్తగారితో ఏర్పడిన గాఢమైన అనుబంధం, పిల్లలను పెంచిన రోజులు తన జీవితంలో మరపురాని భాగాలని తెలిపారు. తన కుటుంబం గురించి ఇప్పటికే అనేక విషయాలు ప్రచురితమయ్యాయని, అయితే కుటుంబ సభ్యులు నిజంగా ఎలాంటి వ్యక్తులు, వారి ఆలోచనలు, ప్రేరణలు, పోరాటాలు, సహజమైన బలహీనతలు ఏమిటనే అంశాలను అర్థవంతంగా చిత్రించిన సందర్భాలు చాలా తక్కువని సోనియా గాంధీ అభిప్రాయపడ్డారు. తాను దగ్గరగా చూసి, ప్రేమించిన వ్యక్తులుగా కుటుంబ సభ్యుల జీవితాలను నిజాయితీగా పాఠకుల ముందుంచాలన్నదే తన ఉద్దేశమని వివరించారు. దేశ రాజకీయ పరిస్థితులపైనా సోనియా గాంధీ తన అభిప్రాయాలను వెల్లడించారు. గత 12 ఏళ్లలో భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, సంస్థలు, సామాజిక నిర్మాణానికి తీవ్ర నష్టం జరిగిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయిన తర్వాత కూడా వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టేందుకు సమయం పడుతుందని, రాజకీయ పార్టీలు పెద్దఎత్తున కృషి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అయినప్పటికీ కాలక్రమంలో దేశ పాలనా వ్యవస్థలు మళ్లీ సరైన దిశలోకి వస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎదుగుదల, బీజేపీ, ఆర్ఎస్ఎస్ రాజకీయ వ్యూహాల నుంచి కాంగ్రెస్ పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదని సోనియా గాంధీ స్పష్టం చేశారు. మోదీ భిన్నమైన భావజాల నేపథ్యం నుంచి వచ్చారని పేర్కొంటూ, కాంగ్రెస్‌లోనూ వివిధ మార్గాల ద్వారా నాయకులు ఎదిగారని గుర్తుచేశారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇందుకు ఉదాహరణలని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ నుంచి కాంగ్రెస్ నేర్చుకోవాల్సింది పెద్దగా ఏమీ లేదని వ్యాఖ్యానించారు.

ప్రతిపక్షాలకు సమాన అవకాశాలు లేవు

ప్రస్తుత రాజకీయ వాతావరణంలో కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష కూటమికి సమాన అవకాశాలు లభించడం లేదని సోనియా గాంధీ ఆరోపించారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజకీయ పోటీలో ప్రతిపక్షాలకు సమాన స్థాయి పోటీ వాతావరణం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లు, భవిష్యత్ రాజకీయ అవకాశాలపైనా తన అభిప్రాయాలను వ్యాసంలో ప్రస్తావించారు.

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రుద్ర అశోక్

- జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేయించి శాలువాతో సత్కరించిన ఎమ్మెల్యే



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 09, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రుద్ర అశోక్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ రుద్ర అశోక్‌తో కేక్ కట్ చేయించి, శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవలో మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతూ, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రుద్ర అశోక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతర కృషి

- నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ

సేవలందిస్తున్నాం: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 09, : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం కృషి చేస్తున్నామని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని తాజా మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు సోమవారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని శంభీపూర్‌లో ఉన్న ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతామని వారికి భరోసా ఇచ్చారు. అదేవిధంగా దీపావళి పండుగను పురస్కరించుకుని పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని పలు శుభకార్యాలు, అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమాలకు హాజరుకావాలని ఆహ్వానించారు.

ధరూర్ గ్రామ అభివృద్ధికి ఎంపీ ల్యాడ్స్ నిధులు

బిజెపి జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ బోగ శ్రావణి

సంఘ ప్రతినిధులకు ప్రొసీడింగ్స్ అందజేత



జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 09, :
జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో కమ్యూనిటీ హాల్, మోతే రెడ్డి సంఘ భవన నిర్మాణానికి నిజామాబాద్ ఎంపీ అరవింద్ ధర్మపురి ఎంపీ ల్యాడ్స్ నిధుల ద్వారా నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా మంజూరైన నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను గ్రామ ప్రజలకు, సంబంధిత సంఘం ప్రతినిధులకు బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ బోగ శ్రావణి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా బోగ శ్రావణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ ప్రజాప్రతినిధుల నిధులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. గ్రామ ప్రజలకు, సామాజిక వర్గాలకు ఉపయోగపడే భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎంపీ అరవింద్ ధర్మపురికి గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ మండల అధ్యక్షులు రామ్ రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మ్యాదారి అశోక్, జగిత్యాల పట్టణ అధ్యక్షులు కాశెట్టి తిరుపతి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు నరపాక అశోక్, అర్బన్ మండల ఉపాధ్యక్షులు తిరుపతి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు దానపనేని నరేష్, బీజేపీ నాయకులు, గ్రామ పెద్దలు, సంఘం ప్రతినిధులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు ఆపన్నహస్తం

తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు రూ.25 వేల ఆర్థిక సాయం

- ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని భరోసా
- నీలం మధు స్పందనపై సిద్దిపేట ప్రజల హర్షం



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 09, :
తల్లిదండ్రులను కోల్పోయి కష్టాల్లో ఉన్న చిన్నారుల దీనస్థితిని సోమవారం సోషల్ మీడియాలో వీడియో ద్వారా చూసిన మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ నీలం మధు ముదిరాజ్ చలించిపోయారు. వెంటనే సిద్దిపేటలోని ఎన్ఎంఆర్ బృందాన్ని పొన్నాల గ్రామానికి పంపించి, ఆ చిన్నారులకు రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేయించారు. అంతే కాకుండా వారికి మనోధైర్యాన్ని కల్పించి, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కన్నవారిని కోల్పోయిన చిన్నారుల కన్నీళ్లు తుడిచేందుకు మానవత్వంతో ముందుకొచ్చిన నీలం మధు ముదిరాజ్ సేవాగుణాన్ని స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీఎంపీఎస్ జిల్లా అధ్యక్షులు చెంది శ్రీనివాస్ ముదిరాజ్, ఎన్ఎంఆర్ జిల్లా అధ్యక్షులు పిల్లి సర్సింహులు ముదిరాజ్, చిన్నకోడూరు ఏఎంసీ వైస్ చైర్మన్ బుస్స రాజశేఖర్ ముదిరాజ్, చేర్యాల ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్, బుగ్గ రాజేశ్వర స్వామి టెంపుల్ చైర్మన్ బాగన్న కరుణాకర్ ముదిరాజ్, వెల్కటూర్ సర్పంచ్ నరేష్ ముదిరాజ్, మిద్దె రవి ముదిరాజ్, చిన్నకోడూరు టీఎంపీఎస్ మండల అధ్యక్షులు దత్తు ముదిరాజ్, జంగపల్లి స్వామి ముదిరాజ్, పొన్నాల గ్రామ శాఖ అధ్యక్షులు శ్రావణ్, మహిపాల్ ముదిరాజ్, నరేష్ ముదిరాజ్, సంపత్ ముదిరాజ్, యాదగిరి, రాజు, బాలకృష్ణ, శ్రీకాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. పేదల కష్టాలకు స్పందించే హృదయం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే నాయకత్వం అదే నీలం మధు ప్రత్యేకత అని పలువురు సిద్దిపేట ప్రజలు నీలం మధుపై ప్రశంసలు కురిపించారు.



బాలసదన్ చిన్నారులతో దీపావళి వేడుకలు జరుపుకున్న సీపీ సాధన రష్మీ పెరుమాళ్

- చిన్నారులకు మిఠాయిలు, నోట్‌బుక్స్, పెన్నుల పంపిణీ
- చిన్నారుల సమస్యల పరిష్కారానికి భరోసా

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 09, :
పండుగల ఆనందాన్ని అందరితో పంచుకోవాలనే గొప్ప ఆశయంతో సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ కొండపాక మండల కేంద్రంలోని నిశాంత్ ఆనంద బాలసదన్ చిన్నారులతో కలిసి ఆదివారం దీపావళి వేడుకలు జరుపుకున్నారు. బాలసదన్‌ను సందర్శించిన సీపీ చిన్నారులందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారికి మిఠాయిలు, నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ, వారితో కలిసి పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. దీంతో బాలసదన్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా చిన్నారుల సమస్యలు, అవసరాలను సీపీ అడిగి తెలుసుకున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పండుగ వేళ చిన్నారుల మధ్య గడిపి, వారిలో ఆనందాన్ని నింపిన సీపీ సేవాభావం పలువురి ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో బాలసదన్ నిర్వాహకులు, ఇన్స్పెక్టర్ లతీఫ్, తొగుట సీఐ శ్రీను, కుకునూరుపల్లి ఎస్ఐ బాలకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బెదిరింపులకు భయపడేది లేదు.. చట్టపరంగా ఎదుర్కొంటాం..

- తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే అనుచరుడిపై చర్యలు తీసుకోవాలి
- కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్
- కాంగ్రెస్ నాయకులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 09, :
ప్రజాస్వామ్యంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు తప్పు చేసినప్పుడు ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్ అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా విమర్శలు చేస్తే బెదిరింపులకు దిగడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలోని సీఐ కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ఫిర్యాదు చేశారు. తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, అంతు చూస్తామని బెదిరింపులకు పాల్పడిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అనుచరుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాట్సాప్ గ్రూపుల్లో అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తూ బెదిరింపులకు పాల్పడటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ విమర్శలను వ్యక్తిగత బెదిరింపులుగా మార్చడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇలాంటి బెదిరింపులకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ దుబ్బాక సీఐ రాజేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సొంత భూమికి పట్టా పాసుపుస్తకం కోసం వృద్ధురాలి ఆవేదన

- ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు
- కోర్టు తీర్పు వచ్చినా న్యాయం జరగడం లేదని ఆవేదన
- అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని వృద్ధురాలి వేదన

హుస్నాబాద్ ప్రతినిధి, నవంబర్ 09, :
తనకు చట్టబద్ధంగా హక్కు ఉన్న భూమికి పట్టా చేసి పాసుపుస్తకం జారీ చేయాలని కోరుతూ ఓ వృద్ధురాలు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించింది. కోర్టు నుంచి అనుకూలంగా తీర్పు వచ్చినప్పటికీ అధికారులు తన సమస్యను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామానికి చెందిన ఆవుదూత అలియాస్ పెట్టుగడి బాలవ్వ (భర్త భూమయ్య) సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా బాలవ్వ మాట్లాడుతూ గౌరవెల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 261/సీలో తనకు చెందిన నాలుగున్నర గుంటల భూమి ఉందని, ఆ భూమిని తన పేరుపై పట్టా చేసి పాసుపుస్తకం జారీ చేయాలని పలుమార్లు అధికారులను కోరినప్పటికీ స్పందన లేదని తెలిపింది. ఈ విషయంలో న్యాయం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, తనకు అనుకూలంగా డిక్లరేషన్ తీర్పు కూడా వచ్చిందని వివరించింది. అయినప్పటికీ గత కొన్ని నెలలుగా అధికారులు తన సమస్యను పరిష్కరించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయింది. వృద్ధాప్యంలో తన సొంత భూమి హక్కు కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, ఈ పరిణామాలతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నానని ఆవేదన వ్యక్తం చేసింది. కోర్టు తీర్పు ఉన్నప్పటికీ తనకు న్యాయం జరగకపోవడం బాధాకరమని పేర్కొంటూ ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని సంబంధిత అధికారులతో విచారణ జరిపించి, తన భూమికి పట్టా పాసుపుస్తకం మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని వృద్ధురాలు బాలవ్వ విజ్ఞప్తి చేసింది.

లక్ష్మీ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అడువాల జ్యోతి లక్ష్మణ్

జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 09, :
జగిత్యాల పట్టణంలోని పలు వ్యాపార సంస్థల్లో నిర్వహించిన లక్ష్మీ పూజా కార్యక్రమాలకు జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొని లక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు. ఈ దీపావళి పర్వదినం సందర్భంగా వ్యాపార సంస్థల యజమానులు, వారి కుటుంబ సభ్యులకు లక్ష్మీదేవి కటాక్షం ఎల్లప్పుడూ ఉండాలని, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.



వడ్డీ రహిత సమాజ నిర్మాణమే ఖిద్మత్ లక్ష్యం

- పదేళ్ల ప్రస్థానంలో 50 శాఖలకు విస్తరణ
- నవంబర్ 9 నుంచి 23 వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు
- ఖిద్మత్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 09, :

వడ్డీ భారం లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఖిద్మత్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ అన్నారు. సామాన్యులు, చిన్న వ్యాపారులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వడ్డీ రహిత ఆర్థిక సేవలు అందించడమే ధ్యేయంగా సంస్థ ముందుకు సాగుతోందని తెలిపారు. సోమవారం సిద్దిపేటలోని ఖిద్మత్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేటలో 2016 జూలై 24న మొట్టమొదటి సారిగా ఖిద్మత్ సొసైటీని ప్రారంభించామని, పదేళ్ల ప్రస్థానంలో సున్నా స్థాయి నుంచి ప్రారంభమైన సంస్థ నేడు కోట్ల రూపాయల లావాదేవీలు నిర్వహించే స్థాయికి ఎదగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ పదేళ్ల విజయవంతమైన ప్రయాణాన్ని పురస్కరించుకుని నవంబర్ 9 నుంచి 23వ తేదీ వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో మొత్తం 50 శాఖలు కొనసాగుతున్నాయని తెలిపారు. సిద్దిపేట శాఖలోనే సుమారు 4,800 ఖాతాలు నిర్వహిస్తున్నామని, ప్రతి సంవత్సరం దాదాపు రూ.16 కోట్ల మేర వడ్డీ రహిత రుణాలు అందిస్తున్నామని వివరించారు. సొసైటీ మొత్తం వ్యాపార లావాదేవీల విలువ రూ.50 కోట్లుగా ఉందన్నారు. ముఖ్యంగా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వారికి, స్వయం ఉపాధిపై ఆధారపడిన వారికి ఖిద్మత్ సొసైటీ కల్పవృక్షంలా అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. వడ్డీ భారం



లేకుండా ఆర్థిక సహాయం అందించడం ద్వారా ఎంతోమందికి ఉపాధి అవకాశాలు మెరుగుపడేందుకు తోడ్పడుతున్నామని చెప్పారు. ఖాతాదారులు తమ పొదుపు మొత్తాలను సొసైటీలో జమ చేసుకోవడంతో పాటు అవసరాలకు అనుగుణంగా రుణాలు పొందుతున్నారని తెలిపారు. ప్రస్తుతం బంగారు రుణాలను సైతం వడ్డీ రహితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. సంస్థ సేవలను మరింత విస్తరించే దిశగా ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్, రాష్ట్రాల్లో త్వరలో మరో 99 నూతన శాఖలను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అబ్దుల్ ఖాదర్ తెలిపారు. వడ్డీ రహిత ఆర్థిక సేవలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించడం, ఈ విధానంలో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఖిద్మత్ సొసైటీ సభ్యులు అబ్దుల్ ఖుద్దూస్, అబ్దుల్ వహీద్, ఇర్షాద్, అహ్మద్ ఖాన్, హాజీ సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్ప సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- డ్రైనేజీ లీకేజీలు, చెత్తాచెదారం, వీధిలైట్లు, సీసీ రోడ్లు, రేషన్ షాపుల సమస్యలపై సీపీఎం వినతి

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 09, : నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో నెలకొన్న డ్రైనేజీ లీకేజీలు, చెత్తాచెదారం, పారిశుద్ధ్య సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం పార్టీ రాజీవ్ గృహకల్ప శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం బాచుపల్లి మండల కార్యదర్శి బి. వెంకటరామయ్య, జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ.. రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో డ్రైనేజీ లీకేజీల కారణంగా మురుగునీరు రోడ్లపైకి ప్రవహిస్తోందని, కాలనీలో



పలుచోట్ల చెత్తాచెదారం పేరుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మురుగునీటి దుర్వాసన, దోమల బెడదతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి డ్రైనేజీ లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని, పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, కాలనీలో నిరంతరం పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని కోరారు. అదేవిధంగా వీధిలైట్ల సమస్యలు, రేషన్ షాపుల నిర్వహణ, సీసీ రోడ్ల నిర్మాణం తదితర స్థానిక సమస్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజీవ్ గృహకల్ప ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాజీవ్ గృహకల్ప శాఖ కార్యదర్శి బాల పేరు, సీపీఎం నాయకులు పి. స్వామి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలకు షాక్..

- టీఆర్ఎస్ లోకి నేతల చేరికలు
- కవిత పాంచజన్య సిద్ధాంతాలు, సామాజిక న్యాయం నినాదానికి ఆకర్షితులై పార్టీలో చేరిన పలువురు నాయకులు

గజ్వేల్ ప్రతినిధి, నవంబర్ 09, :

తెలంగాణ రక్షణ సేనలోకి కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు చేరడం గజ్వేల్ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. ఆయా పార్టీలకు చెందిన పలువురు నాయకులు తమ పార్టీలను వీడి సోమవారం తెలంగాణ రక్షణ సేనలో చేరారు. కుకునూరుపల్లి మండలం లక్ష్మారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ కంకణాల మల్లేశం, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు అష్రాఫ్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఏడో వార్డుకు చెందిన మున్ను, నాలుగో వార్డుకు చెందిన బీజేపీ సీనియర్ నాయకురాలు శైలజ తెలంగాణ రక్షణ సేనలో చేరారు. తెలంగాణ రక్షణ సేన గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి సమక్షంలో పార్టీలో చేరిన వారికి ఆయన కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొట్టాల యాదగిరి మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా తెలంగాణ రక్షణ సేన నిలుస్తోందని, ప్రజలు ఈ విషయాన్ని గుర్తిస్తున్నారని అన్నారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత ప్రతిపాదించిన పాంచజన్య సిద్ధాంతాలు, సామాజిక న్యాయం, బహుజన తెలంగాణ సాధన లక్ష్యాలు తమను ఆకర్షించాయని తెలిపారు. సామాజిక న్యాయం కోసం తమ వంతు పాత్ర పోషించాలనే సంకల్పంతో పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు.



ఈ చేరికలతో గజ్వేల్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేనకు మరింత బలం చేకూరుతుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగని రాజు, లీగల్ సెల్ అధ్యక్షుడు నరేష్ చారి, పాషా, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ప్రత్యేక రైస్ కౌంటర్ ప్రారంభం

- ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన బియ్యం అందించడమే లక్ష్యం
- ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా సరఫరాల అధికారి బ్రహ్మారావు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 09, :

రోజురోజుకూ మార్కెట్‌లో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య ప్రజలకు తక్కువ ధరలకు బియ్యం అందుబాటులోకి తీసుకు రావాలనే ఉద్దేశంతో సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ప్రత్యేక రైస్ కౌంటర్‌ను



సోమవారం ప్రారంభించారు. జిల్లా సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా తూనికలు, కొలతల అధికారి శివరంజని ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక రైస్ కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు రైస్ డిపో అసోసియేషన్ ముందుకు వచ్చిందన్నారు. ప్రభుత్వ నిర్దేశించిన ధరల కంటే తక్కువ ధరకే బియ్యం విక్రయించేందుకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తక్కువ ధరలకు బియ్యం కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీఎస్ఓ సాయి రవి, బియ్యం వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

సత్వర న్యాయం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 09, :

ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా సోమవారం జగిత్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 15 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

కలెక్టర్‌ను కోరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్



జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 09, :

జగిత్యాల సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ బుదుమజ్జి సత్య ప్రసాద్ ని వారి ఛాంబర్‌లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వానాకాలం వరి పంట కోత దశకు చేరుకుందని, జగిత్యాల నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వరి కోతలు ప్రారంభమయ్యాయని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించే క్రమంలో మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు, సంబంధిత అధికారులతో మాట్లాడి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మహా సంప్రోక్షణ గోడపత్రులు, ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

వికలాంగ భక్తులకై ఎలక్ట్రికల్ వాహనం ప్రారంభించిన ఎమ్మెల్యే

మంత్రి పొన్నంను ఆహ్వానించిన ఎమ్మెల్యే, ఆలయ అధికారులు



చొప్పదండి/కొండగట్టు, నవంబర్ 09, :

కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో సోమవారం చందనోత్సవం – మహా సంప్రోక్షణ ను పురస్కరించుకొని, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం శ్రీ స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి చందనోత్సవానికి సంబంధించిన గోడపత్రులు, ఆహ్వాన పత్రికలను కర పత్రములు ఆవిష్కరించారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం, ముఖ్యంగా దివ్యాంగ భక్తులకు ఆలయ ప్రాంగణంలో రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఎలక్ట్రికల్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ వాహనం కొనుగోలుకు దేవస్థానం తరఫున రూ.3 లక్షలు, దాతలైన మారుతి ఎస్ఆర్. డైరీ, కరీంనగర్ వారి తరఫున రూ.2 లక్షలు, మొత్తం రూ.5 లక్షలు వెచ్చించడం జరిగింది. అనంతరం హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ని కలిసి కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారి చందనోత్సవానికి హాజరుకావాల్సిందిగా మర్యాదపూర్వకముగా ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, ఆలయ ఈఓ అంజనా రెడ్డి, గ్రామ సర్పంచ్ ఆదిరెడ్డి, దేవస్థాన స్థానాచార్యులు కపిందర్, ఆలయ సూపరింటెండెంట్ సునీల్ కుమార్, నాయకులు బత్తిని శ్రీనివాస్, కమలాకర్ రెడ్డి ముత్యం శంకర్, రాజనర్సింగరావు, నక్క అనిల్, అజయ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పాపారాయుడు నగర్ లో భారీ అగ్నిప్రమాదం

- అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలించి సహాయక చర్యల్లో పాల్గొన్న ఆరెకపూడి గాంధీ, నాయినేని చంద్రకాంతరావు



కూకట్‌పల్లి ప్రతినిధి నవంబర్ 09, :

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని పాపారాయుడు నగర్ కాలనీలో సోమవారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పేపర్ టీ కప్పులు, ప్లేట్ల తయారీ కంపెనీలో ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలు తీవ్రంగా వ్యాపించడంతో సమీపంలోని జి ఆర్ బి నెయ్యి, హల్దీరామ్స్ గోడౌన్లకు సైతం అగ్నికీలలు వ్యాపించాయి. ఈ ప్రమాద సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయినేని చంద్రకాంతరావు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ కలిసి అగ్నిప్రమాద ప్రాంతాన్ని పరిశీలించి, అక్కడి పరిస్థితులను సమీక్షించారు. అనంతరం మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు చేపట్టిన సహాయక చర్యల్లో పాల్గొని, బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేశారు. అగ్నిప్రమాద తీవ్రత దృష్ట్యా సహాయక చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కోరారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి అండగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

- బాధితుడు చంద్రయ్యకు ఇస్త్రీ పెట్టె, బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీ

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 09, :

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఈస్ట్ సాయినగర్ కాలనీలో నివాసం ఉంటున్న చంద్రయ్యకు చెందిన బట్టల ఇస్త్రీ దుకాణం ఇటీవల షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో దుకాణం పూర్తిగా కాలిపోవడంతో చంద్రయ్య తన జీవనాధారాన్ని కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు ముందుకు వచ్చారు. ఆయన సహకారంతో తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి సోమవారం పిఎసి చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ చేతుల మీదుగా బాధితుడు చంద్రయ్యకు ఇస్త్రీ పెట్టె, బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచి సహాయం అందించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి, మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌కు బాధితుడు చంద్రయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు మారబోయిన రాజు యాదవ్, మరేళ్ల శ్రీనివాస్, ఎండీ ఇబ్రహీం, శేఖర్, మంజుల, అష్రఫ్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.



నెమలిపేట బ్రిడ్జి పునర్నిర్మాణం పనులు ప్రారంభం

- నెమలిపేట నుండి గోపాలపురం రైతుల రాకపోకల ఇబ్బందులపై క్షేత్రస్థాయిలో పరిశీలన
- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

దమ్మపేట, నవంబర్ 09, :

దమ్మపేట మండల కేంద్ర శివారులో నెమలిపేట వాటర్ ట్యాంకు వద్ద గల బ్రిడ్జి గుండా వరదనీరు సజావుగా వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో నెమలిపేట గ్రామంలోని ఇళ్లలోకి వరదనీరు చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపే దిశగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సోమవారం బ్రిడ్జి పునర్నిర్మాణం పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా దమ్మపేట–గోపాలపురం మధ్య ఉన్న వ్యవసాయ భూములకు వెళ్లేందుకు సరైన దారి లేక రైతులు ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించలేక



ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి, రైతులకు ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన పనులు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం దమ్మపేట మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన 82 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గంలో ఈ మూడేళ్ల వ్యవధిలో 4,700 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని, రాష్ట్రంలోనే ముందంజలో ఉన్న నియోజకవర్గంగా అభివృద్ధి పథంలో కొనసాగుతోందన్నారు. మరో విడతగా 5000 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. గతంలో మంజూరై అసంపూర్తిగా మిగిలిపోయిన ఇందిరమ్మ ఇళ్లకు కూడా ఒక్కో ఇంటికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్, తహశీల్దార్ మద్దినేని మురళి, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఆర్.ఐ బిక్షమయ్య, సర్పంచులు రమాదేవి, నాగభూషణం, గురుమూర్తి, గుజ్జుల శ్రీనివాసరావు, సుశీల, ఉప సర్పంచులు ఆంగోతు శ్రీనివాసరావు, చింతలపాటి మురళి, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దాసరోజు సరిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కక్కిరాల రమేష్, ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు చిన్నశెట్టి చిట్టిబాబు, పగడాల రాంబాబు, దాసరోజు రామబ్రహ్మం, రామారావు చిన్నశెట్టి గోపి, గట్ల సర్వేశ్వరరావు, పిట్టల శ్రీనివాసరావు, అన్నవరపు నాగేంద్రరావు, పెరుమాళ్ళ కృష్ణమూర్తి, వనమాల సూరిబాబు, వసంత, కూరం వెంకమ్మ, గ్రామస్తులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు.. లబ్ధిదారుల మోముల్లో ఆనందాలు..

- సొంతింటి కలను సాకారం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లబ్ధిదారుల కృతజ్ఞతలు
- ఘనంగా ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలు
- ముఖ్య అతిథిగా టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి

నంగునూరు, నవంబర్ 09, :

పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఇందిరమ్మ ఇళ్లు దీపావళి వెలుగులతో కళకళలాడాయి. నంగునూరు మండల కేంద్రంలో నిర్మించిన ఇందిరమ్మ నూతన ఇళ్లలో లబ్ధిదారులు కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. నూతన గృహాల్లో దీపాలు వెలిగిస్తూ, కాకర పువ్వొత్తులు, చిచ్చుబుడ్ల వెలుగులతో పండుగ సంబరాలు చేసుకున్నారు. తమ సొంతింటిలో తొలి దీపావళి జరుపుకోవడం పట్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం



చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ వేడుకలకు టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు మండల మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల చిరకాల స్వప్నమైన సొంతింటి కలను నెరవేర్చడమే కాకుండా, వారి నూతన గృహాల్లో దీపావళి వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. పేద కుటుంబాల జీవితాల్లో ఇందిరమ్మ ఇళ్లు కొత్త వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ



తమకు సొంతింటి కలను సాకారం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సహకరించిన రాష్ట్ర ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, మైనంపల్లి హనుమంతరావు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు లబ్ధిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు దాసరి కిషన్, అనరాజు నాగరాజు, చెలికాని యాదగిరి, తుపాకుల శ్రీనివాస్, ఎండీ ఏజాజ్ ఉద్దీన్, సంబంధిత అధికారులు, వార్డు సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దీపావళి వేళ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ముత్తు యాదవ్‌కు సత్కారం

- మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన అభిలాష్ యాదవ్

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 09, :

మూసాపేట భారత్‌నగర్‌కు చెందిన అభిలాష్ యాదవ్ సోమవారం టాస్క్‌ఫోర్స్ సికింద్రాబాద్ జోన్ ఇన్‌స్పెక్టర్ ముత్తు యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం సంప్రదాయబద్ధంగా శాలువా కప్పి సత్కరించారు. పండుగ వేళ కూడా ప్రజల భద్రత కోసం విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారిని కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం ఆనందంగా ఉందని అభిలాష్ యాదవ్ పేర్కొన్నారు. పోలీసు సేవలను అభినందిస్తూ ఇన్‌స్పెక్టర్ ముత్తు



యాదవ్‌కు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మర్యాదపూర్వక కలయిక ఆత్మీయ వాతావరణంలో సాగింది.

పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి దీపావళి సంబరాలు.. స్వీట్లు, టపాసుల పంపిణీ

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 09, :

పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేస్తూ వారి జీవితాల్లో ఆనందపు వెలుగులు నింపుతున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి నిర్వహించిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కాంతులు' కార్యక్రమంలో అత్తు ఇమామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు స్వీట్లు, టపాసులు పంపిణీ చేసి వారితో కలిసి దీపావళి సంబరాలు జరుపుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుతో పాటు అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. పేద కుటుంబాలకు సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తూ వారికి భరోసా కల్పిస్తోందని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం, ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు వైద్య భద్రత కల్పిస్తున్నామని వివరించారు. రేషన్ కార్డుదారులకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయడం దేశంలోనే ప్రత్యేకమని పేర్కొన్నారు. రైతులకు రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తోందని, పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం పనిచేస్తోందని



తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మరో పదేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్యాదరి మధు, గయాజుద్దీన్, విజయ్, డానియల్, నజ్జు, సంతోషి, ప్రవంతి, సాయి తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి స్నేహితుడికి అండగా శంభీపూర్ క్రిష్ణ

- పక్షవాతంతో బాధపడుతున్న మిత్రుడిని పరామర్శించి, కుటుంబానికి ధైర్యం

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 09, :

స్నేహానికి కష్టసుఖాల్లో అండగా నిలవడమే నిజమైన ఆప్యాయతకు నిదర్శనమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు శంభీపూర్ క్రిష్ణ నిరూపించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్ గ్రామానికి చెందిన తన చిన్ననాటి స్నేహితుడు గడిలా రవి ముదిరాజ్ పక్షవాతంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న శంభీపూర్ క్రిష్ణ సోమవారం మిత్రులతో కలిసి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రవి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయనకు అకస్మాత్తుగా అనారోగ్యం కలగడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే తన ఆత్మీయ మిత్రుడు అనారోగ్యానికి గురికావడం బాధాకరమని పేర్కొంటూ, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. రవి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి సాధారణ జీవితం గడపాలని ఆకాంక్షించారు. దీపావళి పండుగ సందర్భంగా ఆయన జీవితంలో మళ్లీ వెలుగులు నిండాలని, ఆ కుటుంబంలో ఆరోగ్యం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. అంతేకాకుండా, ఈ కష్టకాలంలో తాము కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.



బండి రమేష్‌కు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు



కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 09, :

కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ.. దీపావళి పర్వదినం బండి రమేష్ జీవితంలో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు నింపాలని, ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే ఆయన నాయకత్వంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యేకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన తూము శ్రావణ్ కుమార్

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 09, :

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ దీపావళి పండుగ సంతోషాలను అందించాలని, ప్రతి ఇంటా ఆనందం, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కర్క రవీందర్, హరినాథ్, తుకారాం, కృష్ణ, జైరాజ్, నరేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సేవలు

- **జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్**
- **నవంబర్ 11న అవగాహన ర్యాలీ, రక్తదాన శిబిరం**

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 09, :

ప్రతి ఒక్కరికీ సమాన న్యాయం అందించడమే జాతీయ న్యాయ సేవల సంస్థ ప్రధాన లక్ష్యమని సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సుదర్శన్, సంస్థ కార్యదర్శి సౌజన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు అందుబాటులో ఉన్న న్యాయ సేవలను వారు వివరించారు. అర్హులైన పేద, బలహీన వర్గాల ప్రజలకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. సివిల్, క్రిమినల్ కేసుల్లో అవసరమైన న్యాయ సలహాలు, సహకారం అందించడంతో పాటు, కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నేరాల వల్ల నష్టపోయిన బాధితులకు న్యాయ సహాయం, ప్రభుత్వ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామని, కేసుల విచారణలో న్యాయవాది ప్రాతినిధ్యం కూడా కల్పిస్తామని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

11న అవగాహన ర్యాలీ, రక్తదాన శిబిరం

జాతీయ న్యాయ సేవల దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 11వ తేదీన ఉదయం 9:30 గంటలకు సిద్దిపేట జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా



రక్తదాన శిబిరాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. న్యాయ సేవలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో న్యాయవాదులు, న్యాయస్థాన సిబ్బంది, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్, కార్యదర్శి సౌజన్య కోరారు.

ఘనంగా బండారి లేఅవుట్ డివిజన్‌లో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

- **డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు**

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 09, :

బండారి లేఅవుట్ డివిజన్ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలబ్రహ్మచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు బండారి లేఅవుట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాసు వరగాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి ఆయురారోగ్యాలతో, ప్రజలకు మరింత సేవ చేస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాలబ్రహ్మచారి, నందకుమార్, నీలకంఠేశ్వర్, బాలకృష్ణ, శ్రీను, రాజు, రాములమ్మ, నాగమణి, అరుణ, ఉమర్ భాయ్, సలీం, మండల్, భాస్కర్ చారి, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.



ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు.. లబ్ధిదారులతో పండుగ సంబరాలు

- **పేదల సొంతింటి కల సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం**
- **దుబ్బాక నియోజకవర్గంలో ఇప్పటివరకు 5,500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు**
- **దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్**

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 09, :

అక్బర్‌పేట-భూంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల మధ్య దీపావళి పండుగ సంబరాలు ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ వేడుకల్లో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామి గౌడ్, గ్రామ సర్పంచ్ నీల ప్రభాకర్ పాల్గొని లబ్ధిదారులతో కలిసి దీపావళి వేడుకలు జరుపుకున్నారు.



ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల సొంతింటి కల సాకారమవుతున్న తరుణంలో, లబ్ధిదారులతో కలిసి పండుగ జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పాతూరి వెంకటస్వామి గౌడ్, సర్పంచ్ నీల ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రతి ఇంటా సంతోషాలు, ప్రతి కుటుంబంలో ఆనందపు వెలుగులు నిండాలని ఆకాంక్షిస్తూ లబ్ధిదారులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు నియోజకవర్గానికి 5,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నవీన్ గౌడ్, మాజీ ఎంపీటీసీ పాతూరి శ్రీనివాస్ గౌడ్, కూడవెల్లి దేవస్థానం డైరెక్టర్ వెలుపుల యాదగిరి ముదిరాజ్, వార్డు సభ్యులు గడ్డం యాదగిరి, బొమ్మరపు సుకన్య ఎల్లం, బోడోళ్ల అంజయ్య, గోద శృతి, వెలుపుల సత్తవ్వ రాజయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గోపరి రమేష్, పొట్టేళ్ల పరుశురాములు, వేల్పుల ఎల్లం, గొడుగుపల్లి మల్లయ్య, వేల్పుల అంజయ్య, గోదా పరుశయ్య తదితరులు పాల్గొన్నారు.

లెజెండరీ స్టేట్ కాలనీలో రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



- **ప్రజా అవసరాలకు అనుగుణంగా దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతాం: కొలన్ హన్మంత్ రెడ్డి**

కుత్బుల్లాపూర్, నవంబర్ 09, :

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి పరిధిలోని లెజెండరీ స్టేట్ కాలనీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సీఎంసీ నిధుల ద్వారా రూ.40 లక్షల వ్యయంతో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఆయన స్థానిక సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పన, కాలనీ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై వారితో చర్చించారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, వరగాని వాసు, కోటపాటి మురళి, సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, మైసిగరి శ్రీనివాస్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి రఫియా బేగం, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షురాలు కడియాల ఇందిరా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆలేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కాలనీ సభ్యులు వెంకట్ నల్లమల, శ్రీనాథ్ కానూరి, మురళి, రంగనాయకులు, శ్రీనివాస్, ప్రసాద రెడ్డి, శ్రీకాంత్, కృష్ణ రెడ్డి, ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాలల రోస్టర్ పాయింట్ల సవరణ కోసం సంఘటితంగా ఉద్యమించాలి

- **విద్యా, ఉద్యోగ రంగాల్లో మాలలకు అన్యాయం జరుగుతోంది**
- **కోర్ కమిటీ సభ్యులు తిరుపతయ్య**

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 09, :

విద్యా, ఉద్యోగ రంగాల్లో మాలలకు అన్యాయం జరుగుతున్న రోస్టర్ పాయింట్లను సవరించే వరకు సంఘటితంగా ఉద్యమించాలని రిటైర్డ్ కెనరా బ్యాంక్ ఏజీఎం, మాల కోఆర్డినేషన్ ఫోరం కోర్ కమిటీ సభ్యులు సిహెచ్ తిరుపతయ్య పిలుపునిచ్చారు. ఆదివారం సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు లింగారెడ్డిపల్లిలో డాక్టర్ అంబేద్కర్ అభ్యుదయ సంఘం, సిద్దిపేట మాలల జేఏసీ ఆధ్వర్యంలో రోస్టర్ పాయింట్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టం అమలులో భాగంగా నూతనంగా ప్రవేశపెట్టిన రోస్టర్ పాయింట్ల కేటాయింపులో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. మల్టీ జోన్ల విధానం వల్ల కూడా మాలలకు ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన రోస్టర్ విధానం వల్ల రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ హక్కులకు విఘాతం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మాలల రోస్టర్ పాయింట్లను 22 నుంచి 10లోపు తగ్గించే వరకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. మాలలకు జరుగుతున్న అన్యాయంపై గ్రామగ్రామాన, గడపగడపకు వెళ్లి ప్రచారం నిర్వహించాలని, సమాజాన్ని చైతన్యపరిచి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ హక్కులను కాపాడుకోవాలని కోరారు. సిద్దిపేట మాలల జేఏసీ చైర్మన్ ఆశ లక్ష్మణ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా మాలల జనాభాను తక్కువగా చూపించి వర్గీకరణ చేయడం వల్ల అన్యాయం జరుగుతోందని అన్నారు. జిల్లా మాలల జేఏసీ గౌరవాధ్యక్షులు గ్యాదరి రామస్వామి మాట్లాడుతూ మాలలకు జరుగుతున్న అన్యాయంపై జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో ఐక్య ఉద్యమాలు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ సదస్సులో జిల్లా మాల జేఏసీ కోర్ కమిటీ సభ్యులు మెరుగు మహేష్, అల్లిబిల్లి నరసింగరావు, దేవరాజు, సత్యకృష్ణ, పార్థసారథి, పి.




శంకర్, ఎల్లేష్, పత్రి యాదగిరి, పల్లెటూరి ప్రసాద్, అండె ప్రవీణ్, న్యాయవాది భిక్షపతి, కొడకండ్ల కృష్ణ, రాజేందర్, పోతుల రాజేశం, పోతుల మోహన్, టీఎన్జీవో సంఘం తాలూకా అధ్యక్షులు పోతుల సత్యనారాయణ, డాక్టర్ అంబేద్కర్ అభ్యుదయ సంఘం అధ్యక్షులు తప్పెట రమేష్, కుల సంఘం అధ్యక్షులు పోతుల మహేష్, భరత్, నర్సింగరావు, బద్ది రాజు, మెరుగు రాజు, లక్ష్మీనారాయణ, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నిండాలి

- **దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు**

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 09, :

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ ను సోమవారం కుత్బుల్లాపూర్‌లోని ఆయన నివాస కార్యాలయంలో పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ.. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. దీపాల కాంతులతో ఇళ్లు ప్రకాశించడమే కాకుండా, ప్రజల జీవితాల్లోని చీకట్లు తొలగి సుఖసంతోషాలు వెల్లివిరియాలని అన్నారు. ప్రతి కుటుంబంలో ఆనందం, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సమృద్ధిగా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షిస్తూ నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



అప్పారావును పరామర్శించిన బండి రమేష్

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 09, :

కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొడుగు అప్పారావు ఇటీవల అస్వస్థతకు గురై ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన విషయం తెలుసుకున్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ సోమవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా అప్పారావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎలాంటి అవసరం వచ్చినా అప్పారావు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వర్ రావు, రాజేష్ గౌడ్, అరవింద్ రెడ్డి, బచు మల్లీ, బాబ్జీ, మణి గౌడ్, శివ చౌదరి, సంధ్య తదితరులు పాల్గొని పొడుగు అప్పారావును పరామర్శించారు.



ఎమ్మెల్యే కె.పి. వివేకానందకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 09, :

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కె.పి. వివేకానందను బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కుంట సిద్ధిరాములు, అప్పల శేఖర్, కుంట బాలయ్య ఎమ్మెల్యే కె.పి. వివేకానందకు స్వీట్ బాక్స్ అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

- బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కొలన్ హన్మంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 09, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, డీసీసీ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, డీసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సాపూర్ పురాతన గ్రంథాలయాన్ని సందర్శించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం

గ్రామంలో గ్రంథాలయ పునరుద్ధరణకు చర్యలు

పుస్తకాలు అందించేందుకు చొరవ

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 09, :



సిద్దిపేట అర్బన్ మండలం నర్సాపూర్ లోని పురాతన గ్రంథాలయాన్ని సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ చరిత్ర, గతంలో అందించిన సేవలు, ప్రస్తుతం దాని పరిస్థితి గురించి గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, వారికి అందుతున్న మధ్యాహ్న భోజన సదుపాయాలు, విద్యా వసతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రం మాట్లాడుతూ నర్సాపూర్ గ్రామంలో గ్రంథాలయాన్ని తిరిగి అందుబాటులోకి తీసుకురావడానికి గ్రామస్తులు ముందుకు రావాలని కోరారు. గ్రామపంచాయతీకి సంబంధించిన భవనంలో లేదా పాఠశాల ఆవరణలో అనువైన భవనం ఏర్పాటు చేస్తే అవసరమైన పుస్తకాలను సమకూర్చేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. ఈ విషయంపై గ్రామస్తులతో సానుకూలంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు మంద పాండు, నిజాముద్దీన్, వంగపల్లి అశోక్, యాదగిరి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దీపావళి వేళ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు శుభాకాంక్షల వెల్లువ

- షాపూర్ నగర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 09, : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ను నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం షాపూర్ నగర్‌లోని ఆయన నివాసానికి చేరుకున్న పలువురు నేతలు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చింతల్ డివిజన్ పరిధిలోని రంగానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు కూన శ్రీశైలం గౌడ్‌ను కలిసి కాలనీలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తానని హామీ ఇచ్చారు. కాలనీల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. అదేవిధంగా నియోజకవర్గానికి చెందిన పలువురు తమ కుటుంబాల్లో నిర్వహించనున్న వివిధ శుభకార్యాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆయనకు అందజేసి కార్యక్రమాలకు ఆహ్వానించారు. పండుగ వేళ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల రాకతో ఆయన నివాసంలో సందడి నెలకొంది.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మె

- రూ.18 వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి
- డీఎంహెచ్ఓకు సమ్మె నోటీసు అందజేసిన జేఏసీ నాయకులు



సిద్దిపేట కలెక్టరేట్, నవంబర్ 09, :

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, నెలకు రూ.18 వేల స్థిర వేతనం నిర్ణయించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని జేఏసీ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరిస్తూ ప్రజావాణిలో సోమవారం డీఎంహెచ్ఓకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అమ్ముల బాల నరసయ్య, బీఆర్టీయూ జిల్లా కార్యదర్శి మంచె నర్సింలు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ఆశా వర్కర్లు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. గర్భిణులను ఆసుపత్రులకు తీసుకెళ్లి సురక్షిత ప్రసవాలు జరిగేలా చూడటంతో పాటు తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. సీజనల్, అంటువ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధుల నివారణలోనూ ఆశా వర్కర్లు ముందుంటున్నారని, కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించారని కొనియాడారు. ఉదయం నుంచి రాత్రి వరకు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నో బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ వారికి తగిన గుర్తింపు, వేతనం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం, పని భారం అధికం కావడంతో ఆశా వర్కర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల స్థిర వేతనం నిర్ణయించాలని, రూ.50 లక్షల జీవిత బీమా, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు చెల్లించాలని కోరారు. పదవీ విరమణ సమయంలో రూ.5 లక్షల ప్రయోజనం కల్పించాలని, పారితోషికంలో సగం మొత్తాన్ని పింఛన్‌గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఆదివారం, పండుగలకు సెలవులు, ఏడాదికి 20 రోజులు సాధారణ సెలవులు, ఆరు నెలల వేతనంతో కూడిన వైద్య సెలవులు ఇవ్వాలని కోరారు. శిక్షణ పొందిన ఆశా వర్కర్లకు పదోన్నతి అవకాశాలు కల్పించాలని, రెండో వేతన సవరణ సంఘం పరిధిలోకి తీసుకువచ్చి కనీస వేతనం రూ.30 వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రెండు కరవు భత్యాలు, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడాల కనకయ్య, జిల్లా నాయకులు బర్మ కొమురయ్య, బీఆర్టీయూ నాయకులు, ఆశా వర్కర్లు ప్రవీణ, శారద, భూలక్షి , లక్షి , దీన తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్
- పలు సమస్యలపై వినతులు స్వీకరించిన కలెక్టర్

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 09, :

ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే



విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, డిఆర్ఓ కె. వై ప్రసాద్, ఆర్డీఓలు మధు సూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహ రావు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

పర్వతనగర్ అభివృద్ధికి మరో ముందడుగు

- రూ.25 లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి ప్రతినిధి నవంబర్ 09, :

అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వతనగర్ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మరో అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సున్నం చెరువు పార్కు వద్ద రూ.25 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అయితే గతంలో శంకుస్థాపనలు చేసి ప్రారంభించిన అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నత్తనడకన సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాల కల్పనకు కూడా ప్రభుత్వం సరైన నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. ప్రజలకు ఎప్పుడు ఏ సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి తాను నిరంతరం కృషి చేస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సబియా గౌసుద్దీన్, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షులు లింగాల అయిలయ్య, బాబా, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సిద్దిపేట పట్టణంలో ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

- సాకి ఆనంద్, తప్పేట శంకర్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్, అన్నదానం
- సీఎం ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన నాయకుడని పొగడ్తలు






సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 09, :

సిద్దిపేట జిల్లా కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను మాజీ కౌన్సిలర్ సాకి ఆనంద్, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ తప్పెట శంకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి మోడ్రన్ బస్టాండ్ ఆటో స్టాండ్ వద్ద కేక్ కటింగ్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రగతికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రయాణం ఎందరికో స్ఫూర్తిని ఇస్తుందని పేర్కొన్నారు. సీఎం రాష్ట్రానికి అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి, సమయస్ఫూర్తి ప్రసంగాలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపడమే కాకుండా ప్రజల్లో సుస్థిర స్థానం పొందుతున్నారని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం తెలంగాణకు దిశానిర్దేశం చేస్తుందని పొగడ్తల గుప్పించారు. రేవంత్ రెడ్డికి భగవంతుడు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలిగించాలని కోరుకుంటూ సీఎం రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు ఆర్టిఏ మెంబెర్ సూర్య వర్మ, మాజీ పట్టణ అధ్యక్షులు చొప్పదండి చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ చాంద్ పాషా, బుచ్చిరెడ్డి, రియాజ్, సీనియర్ నాయకులు మార్క. సతీష్, గ్యార రవి, సదాశివ రెడ్డి, గొడ్డు బాలరాజ్, బిక్షపతి, శ్రవణ్, మహిళా నాయకులు, ఎన్ఎస్యుఐ నాయకులు మామిడాల. స్రవంతి, సంతోషి, సనా, రజిని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జన్మదినం సందర్భంగా ఎమ్మెల్సీ శంబిపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిసిన రుద్ర అశోక్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 09, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రుద్ర అశోక్ తన జన్మదినం సందర్భంగా సోమవారం ఎమ్మెల్సీ శంబిపూర్ రాజును వారి నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు రుద్ర అశోక్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవలో మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేయాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రుద్ర అశోక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.





కవితలో కాలం పలికిన స్వరం అందెశ్రీ

నేడు అందెశ్రీ ప్రథమ వర్ధంతి

తెలుగు నేలపై తన గొంతుతో, తన గీతాలతో ప్రజల గుండెల్లో నినదించిన పేరు అందెశ్రీ. అసలు పేరు అందె ఎల్లయ్య. విద్యా ప్రక్రియలో అడుగుపెట్టక పోయినా, ప్రజల మనస్సుల్లో పఠితుడైన కవి ఆయన. నిరక్షరాస్యుడైనప్పటికీ తన హృదయాన్ని కవిత్వంగా మార్చుకొని, తెలంగాణ భూమి, దాని భాష, దాని మనుషులు, దాని పోరాటాలకు స్వరం ఇచ్చిన అపూర్వ గేయకవి అందెశ్రీ. 1961 జూలై 18న అప్పటి వరంగల్ జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో ఆయన జన్మించారు. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా పెరిగారు. చదువు లేకపోవడం ఆయన కవిత్వానికి అడ్డంకి కాలేదు. గొర్రెల కాపరిగా, తాపీ పనికూలీగా జీవనం సాగించిన ఈ కవి, తన అంతరంగంలోని వేదనను, ప్రకృతి పట్ల ప్రేమను, మానవతా విలువలను గీతాలుగా మలచాడు. నిజామాబాద్ ప్రాంతంలో తాపీ పని చేస్తున్నప్పుడు ఆయన పాటలు విన్న శృంగేరి మఠానికి చెందిన శంకర్ మహారాజ్ ఆయనను చేరదీసి, ఆయన ప్రతిభను వెలికితీశారు. ఆ పరిచయమే కవి జీవితాన్ని మలుపుతిప్పింది. అక్షరాలను నేర్చుకోకపోయినా, అక్షరాలకు అర్థం చెప్పిన కవి ఆయన. తన ఆశు కవిత్వం, స్వతంత్ర వాక్యనిర్మాణం, అంతర్భావం ఆయనను ప్రజాకవిగా నిలబెట్టాయి. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా కొనసాగుతున్న రోజుల్లో, అందెశ్రీ గీతాలు ప్రజల్లో ఉత్సాహం నింపాయి. ఆయన గీతం "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" తెలంగాణ రాష్ట్ర గీతంగా గుర్తింపు పొందడం చారిత్రక ఘట్టం. ప్రతి విద్యాసంస్థలో, ప్రభుత్వ కార్యాలయంలో ప్రతిరోజు ఉదయాన్నే ఆ గీతం ప్రతిధ్వనించడం ఆయన కవిత్వం ప్రజల్లో పొందిన స్థిరమైన స్థానం యొక్క సాక్ష్యం. అందెశ్రీ రచనల్లో మట్టి వాసన, మనిషి శ్వాస, భాష సౌందర్యం మిళితమై ఉంటాయి. ఆయన గీతాలు కేవలం వినోదం కోసం కాదు, అవి ప్రజల ఆత్మగీతాలు–చైతన్యరాగాలు. "మాయమై పోతున్నాడమ్మా మనిషన్నవాడు" అనే గీతం (ఎర్ర సముద్రం సినిమా) సమాజంలో నశిస్తున్న మానవత్వంపై ఆయన ఆవేదనను ప్రతిబింబిస్తుంది. ఈ గీతాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాలు తెలుగు సిలబస్‌లో చేర్చడం ఆయన కవిత్వానికి లభించిన అంగీకారానికి చిహ్నం. "పల్లె నీకు వందనములమ్మో", "గలగల గజ్జెల బండి", "కొమ్మ చెక్కితే బొమ్మరా" వంటి పాటలు ఆయన సృజనలోని గ్రామీణ రసాన్ని, ప్రకృతి సౌందర్యాన్ని ప్రతిఫలిస్తాయి. "జనజాతరలో మన గీతం", "యెల్లిపోతున్నావా తల్లి" వంటి పద్యాలు ఆయన లోని మానవతా కవి స్వభావానికి ఉదాహరణలు. 2006లో వచ్చిన 'గంగ' సినిమాకు ఆయన రాసిన పాటకు నంది పురస్కారం లభించింది. అదే సంవత్సరం నుంచి ఆయన పేరు రాష్ట్ర సరిహద్దులను దాటి ప్రతిధ్వనించింది. ఆయన ప్రతిభను గుర్తించిన కాకతీయ విశ్వవిద్యాలయం 2008లో గౌరవ డాక్టరేట్ అందజేసింది. ఆ తర్వాత అమెరికాలోని అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్, వాషింగ్టన్ డి.సి. వారిచే ఆయనకు గౌరవ డాక్టరేట్, లోకకవి బిరుదు లభించాయి. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర విశిష్టమైనది. తెలంగాణ ధూంధాం కార్యక్రమ రూపశిల్పిగా ప్రజల్లో సాంస్కృతిక చైతన్యం రగిలించిన కవి ఆయన. ఆయనే ప్రజా గీతాల రూపంలో ఉద్యమానికి ఊపిరి పోశాడు. 2014లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన పేరును పద్మశ్రీ పురస్కారం కోసం ప్రతిపాదించింది. 2025 జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయనకు రూ. కోటి నగదు పురస్కారం అందజేయడం ఆయన సాహిత్య కృషికి లభించిన గౌరవం. అందెశ్రీ సాహిత్యం మట్టిలోనుంచి మొలిచినది. అది భాషలో, బతుకులో, బంధాలలో, బతుకుబాటలో దాగి ఉన్న మానవ వేదనను ప్రతిబింబిస్తుంది. కవిత్వం అనేది పుస్తకాలలో ఉండే అక్షరం కాదని, పల్లెలో వినిపించే గళమని ఆయన నిరూపించారు. తన గీతాలతో తెలంగాణ సాంస్కృతిక ఆత్మకు రూపం ఇచ్చిన ఆయనకు, కవి కాకుండా ప్రజా భావజాలానికి ప్రతినిధి అనే విశేషణం సముచితమవుతుంది. సాహిత్య సృష్టులు ఆయన జీవితం – ఆయన గీతాల్లో జలజీవన వేదన ఉంది, పల్లెల మనసు ఉంది, తెలంగాణ ఆత్మ ఉంది. నవంబర్ 10, 2025న ఆయన పరమపదించినా, ఆయన స్వరం తెలంగాణ మట్టి, గాలి, జలంలో ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. అందెశ్రీ కవిత్వం – తెలంగాణ గళం, ప్రజల హృదయం.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

విజ్ఞానమే విశ్వ ప్రగతికి పునాది!

నేడు ప్రపంచ సైన్స్ దినోత్సవం



ప్రపంచ సైన్స్ దినోత్సవం ప్రధానంగా నాలుగు ప్రధాన కారణాల కోసం జరుపుకుంటారు. సైన్స్ మన ఆరోగ్యం, ఆహారం, శక్తి, పర్యావరణం వంటి అనేక రంగాలలో కీలక పాత్ర పోషిస్తుంది. సైన్స్ వినియోగం ఎలా జరుగుతుందో, అది ప్రజలకు ఎలా ఉపయోగ పడుతుందో ఈ రోజుతో అవగాహన కలుగుతుంది. వివిధ రంగాల్లో పరిశోధనలు, కనుగొనడాలు చేసిన శాస్త్రవేత్తలు విజ్ఞాన శాస్త్రానికి అసాధారణ చేసిన కృషిని గౌరవించడానికి ఈ రోజు ఒక మంచి అవకాశం. సైన్స్ ఆవిష్కారాలు, పురోగతులు సాంఘిక జీవనానికి ప్రయోజనం చేకూరుస్తాయి. సైన్స్ లోని కొత్త ఆవిష్కారాలను సొంతంగా మన జీవనంలో అనుసంధానించడం, వాటిని సమాజానికి సమర్థించు కోవడం ఈ రోజు ప్రాధాన్యత. యువతలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించడం, పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వడం, తద్వారా కొత్త శాస్త్రవేత్తలను తయారు చేయడం కోసం ఈ రోజు ఒక ప్రేరణ. ప్రపంచ వ్యాప్తంగా ఈ రోజును పలు రకాల కార్యక్రమాలతో జరుపు కుంటారు. పాఠశాలలు, కళాశాలలు, పరిశోధనా సంస్థలు విద్యార్థులకు తమ సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించే అవకాశం ఇస్తాయి. ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు పాల్గొనే సదస్సులు నిర్వహించ బడతాయి. యువతలో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు అనేక రకాల సైన్స్ పోటీలు నిర్వహించ బడతాయి. సైన్స్ రంగానికి సంబంధించిన డాక్యుమెంటరీలు, చిత్రాలు ప్రదర్శించ బడతాయి. సందర్శకుల కోసం సైన్స్ మ్యూజియంలు ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తాయి. ప్రపంచ సైన్స్ దినోత్సవం విజ్ఞాన శాస్త్రం ప్రాముఖ్యతను గుర్తించే ఒక ప్రత్యేకమైన రోజు. సైన్స్ మన జీవితాలను మెరుగుపరిచే ఒక సాధనం మాత్రమే కాదు, అది సమాజానికి, ప్రపంచానికి పురోగతిని అందించే ఒక గొప్ప శక్తి. అందుకే, మనం ఈ రోజును జరుపుకోవడం ద్వారా సైన్స్ పట్ల గౌరవాన్ని, యువతకు సైన్స్ పై ఆసక్తిని పెంచడానికి కృషి చేయాలి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



ప్రపంచ సైన్స్ దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబర్ 10న జరుపు కుంటారు. ఈ రోజు సైన్స్ ప్రాముఖ్యతను గుర్తించడం ద్వారా మానవాళి అభివృద్ధికి దోహదం చేసే విజ్ఞాన శాస్త్రంపై అవగాహన పెంచుతుంది. సైన్స్ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి, సమస్యలను పరిష్కరించడానికి, జీవన ప్రమాణాలను మెరుగు పరచడానికి కీలక పాత్ర పోషిస్తుంది.

తెలుగు భాషకు చార్లెస్ బ్రౌన్ ఎనలేని సేవ

నేడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతి


పరదేశీయుడైనా, ఆంగ్ల భాష మాతృభాష అయినా, బహు భాషవేత్త అయి ఉండీ, ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగిగా భారత దేశానికి వచ్చి, విధి నిర్వహణ కోసం తెలుగు భాష నేర్చుకుని, నాటికి కరడుగట్టి, మినుకు మినుకు మంటూ, ఆరి పోవడానికి సిద్ధంగా ఉన్న తెలుగు భాష ఉద్ధరణకు బ్రౌన్ తీసుకున్న చొరవ ప్రశంసనీయం. ఆంగ్లేయులు పురాణాలను ప్రచురించడం, వ్యాఖ్యానాలు రాయించడం, తెలుగు నేర్చు కోవడం కోసం వాచకాలు, వ్యాకరణ గ్రంథాలు రాయడం, ప్రచురించడం, సహస్రాధిక వేమన పద్యాలను వెలికితీసి ప్రచురిం చడం, పాఠశాలలు స్థాపించి, ఉచిత విద్య నేర్చుకునే అవకాశం కల్పించడం, ప్రాచీన గ్రంథాలను అర్థం చేసుకోవడానికి ఏకంగా నిఘంటువుని అందించడం ద్వారా తెలుగు భాషా, సాహిత్య వికాసానికి బ్రౌన్ అందించిన సేవ అమోఘం, అపూర్వం, అస మానం అనితర సాధ్యం.

చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (నవంబర్ 10, 1798 – డిసెంబర్ 12, 1884) తెలుగు సాహిత్యమునకు విశేష సేవ చేసిన ఆంగ్లేయుడు. తొలి తెలుగు శబ్దకోశమును ఆయనే పరిష్కరించి ప్రచురించాడు. బ్రౌన్ దిక్షనరీని ఇప్పటికి తెలుగులో ప్రామాణికంగా ఉపయోగిస్తారు.

సి. పి. బ్రౌన్ 1798 నవంబర్ 10న కలకత్తాలో జన్మించాడు. ఈయన తండ్రి డేవిడ్ బ్రౌన్ పేరొందిన క్రైస్తవ విద్వాంసుడు. తండ్రి మరణించిన తరువాత బ్రౌ ను కుటుంబం ఇంగ్లండు వెళ్ళిపోయింది. తండ్రి ఇచ్చిన స్ఫూర్తితో సీపీ బ్రౌన్ గ్రీక్, లాటిన్, పారశీ, సంస్కృత భాషల్లో ఆరితేరాడు, బ్రౌను అక్కడే హిందూ స్థానీ భాష నేర్చుకున్నాడు. తరువాత 1817 ఆగష్టు 4 న మద్రాసులో ఈస్ట్ ఇండియా కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా మద్రాసులో కోదండరామ పంతులు వద్ద తెలుగులో ప్రాథమిక జ్ఞానాన్ని సంపాదించాడు.

1820 ఆగస్టులో కడపలో డిప్యూటీ కలెక్టరుగా చేరాడు. ఉద్యోగరీత్యా అనేక ప్రాంతాల్లో పని చేసినపుడు తెలుగులో మాట్లాడడం తప్పనిసరి అయింది. అయితే తెలుగు నేర్చు కోడానికి సులభమైన, శాస్త్రీయ మైన విధానం లేక పోవ డం వలన, పండితులు తమ తమ స్వంత పద్ధతులలో బోధిస్తూ ఉండేవారు. తెలుగేతరులకు ఈ విధంగా తెలుగు నేర్చుకోవడం ఇబ్బందిగా ఉండేది. భాష నేర్చుకోవడంలో ని ఇబ్బంది, బ్రౌనును తెలుగు భాషా పరిశోధనకై పురికొ ల్పింది. ప్రాచీన తెలుగు కావ్యాలను వెలికితీసి, ప్రజలందరికీ అర్థమయ్యేలా పరిష్కరించి, ప్రచురించడం, భాషకు ఓ వ్యాకరణం, ఓ నిఘంటువు, ఏర్పడడానికి దారి తీసింది. మచిలీపట్నం, గుంటూరు, చిత్తూరు, తిరునెల్వేలి మొదలైన చోట్ల పనిచేసి, 1826లో మళ్ళీ కడపకు తిరిగి వచ్చి అక్కడే స్థిర నివాస మేర్పరచు కొన్నాడు.

కడపలోను, మచిలీపట్నంలోను కూడా పాఠశాలలు పెట్టి ఉచితంగా చదువు చెప్పించాడు. విద్యార్థులకు ఉ చితంగా భోజన వసతి కూడా కల్పించాడు. 1834లో ఉ ద్యోగం నుండి తొలగించడంతో ఇంగ్లండు వెళ్ళిపోయి, తిరిగి 1837లో కంపెనీలో పర్షియను అనువాద కుడిగా భారత దేశానికి వచ్చాడు.



1827 నాటికే, బ్రౌన్ 'ఆంధ్ర గీర్వాణ ఛందము' అనే పుస్తకం రాసినప్పటికీ, ఆయనకు మంచి గుర్తింపు తెచ్చిన పుస్తకం 1829 నాటి 'వేమన శతకం'. అప్పటికి బ్రౌన్ అయిదేళ్లుగా వేమన సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ ఉ న్నారు. ఇందులో దాదాపు 700 పద్యాలకు ఆంగ్లాను వాదాలతో పాటు విస్తృతమయిన పదకోశం కూడా సమకూర్చారు. మరో పదేళ్ల తర్వాత, 1164 పద్యాల వరకు విస్తరింపచేసి, తిరిగి 'వేమన శతకం' అచ్చువేశాడు. పదవీ విరమణ తరువాత 1854లో లండన్‌లో స్థిరపడి, 1865లో లండన్ యూనివర్సిటీలో తెలుగు ప్రొఫెసరుగా నియమితుడైనాడు.

బ్రౌన్ కొలువులో తొలి తెలుగు కథకుడు తాతాచారి అనే పేరుతో ప్రాచుర్యం పొందిన నేలటూరు వేంకటాచలం. తాతాచారి చెప్పిన కథలను విన్న సి. పి. బ్రౌన్ అందులోంచి 24 కథలను, దానితోపాటు శ్రీకృష్ణమాచారి చెప్పిన రెండు కథలను కలిపి 1855లో పుస్తకంగా ముద్రించారు. 1916లో 'తాతాచారి కథలు ' గిడుగు వేంకట అప్పారావు సంపాదకత్వంలో ద్వితీయ ముద్రణ పొందాయి. 1951లో వావిళ్ల వారి తృతీయ ముద్రణ, 1974లో బంగోరె సంపాదకుడిగా చతుర్థ ముద్రణ పొందాయి. 1848లో చెన్నపట్నం వెళ్లి బ్రౌను కొలువులో ఏడేళ్ల పల్నాటి వీర చరితం, వసు చరిత్ర మొదలైన గ్రంథా ల పరిష్కార కృషిలో ఆయనకు సాయపడ్డారు. తాతాచార్యులు కావ్య తర్క వ్యాకరణముల యందు ప్రవీణత గలవాడు. తాతాచారి కథలు నీతి బోధకాలే కాక, ఆనాటి సామాజిక స్థితికి దర్పణంగాను ఉన్నాయి. అందులోని శైలి శుద్ధ వ్యావహారికం అయిన కారణంగా పండిత శైలికి దూరంగా ఉందనే బ్రౌన్ ప్రశంసకు యోగ్యమైంది.

బ్రౌన్ వేమన పద్యాలను వెలికితీసి ప్రచురించాడు. 1829లో 693 పద్యాలు, 1839లో 1164 పద్యాలు ప్రచురించాడు. 1841లో "నలచరిత్ర"ను ప్రచురించాడు. "ఆంధ్ర మహా భారతము", "శ్రీమద్భాగవతము" లను ప్రచురించాడు. తెలుగు నేర్చుకునే ఆంగ్లేయుల కొరకు వాచకాలు, వ్యాకరణ గ్రంథాలు రాసాడు. 1840లో వ్యాకరణాన్ని ప్రచురించాడు. లండన్‌లోని "ఇండియాహౌ స్ లైబ్రరీ"లో పడి ఉన్న 2106 దక్షిణభారత భాషల గ్రంథాలను మద్రాసు తెప్పించాడు. "హరిశ్చంద్రుని కష్టాలు" గౌరన మంత్రిచే వ్యాఖ్యానం వ్రాయించి 1842లో ప్రచురించాడు. 1844లో "వసుచరిత్ర"', 1851లో "మను చరిత్ర" ప్రచురించాడు. జూలూరి అప్పయ్య శాస్త్రి చేత వీటికి వ్యాఖ్యానాలు రాయించాడు. 1852లో "పలనాటి వీరచరిత్ర" ప్రచురించాడు.

పందొమ్మిదో శతాబ్ది తొలి చివర్లో తాను తెలుగు సాహిత్యంలో కృషి మొదలుపెట్టే నాటికి నెలకొని వుండిన స్థితిగతులను గురించి బ్రౌన్ స్ఫుటమయిన మాటల్లో అభివర్ణించాడు. 'అప్పటికి తెలుగు సాహిత్యం కొనప్రాణంతో కొట్టుకు మిట్టాడుతోంది. 1825 నాటికి ప్రమిదలో దీపం కొడిగట్టి పోతోంది. తెలుగు సాహిత్యం దాదాపు అంతరించి పోతూ ఉండడం నా కళ్లబడింది. నేను 30 ఏళ్ల కృషి చేసి, దాన్ని పునఃప్రతిష్ట చేశాన'న్నాడు బ్రౌన్. తెలుగు భాషాభివృద్ధికి ఇతోధిక సేవలు అందించి, మరచిపోలేని కృషి సల్పిన బ్రౌన్ 1884 డిసెంబర్ 12 న తన స్వగృహము 22 కిల్డారే గార్డెన్స్, వెస్ట్‌బార్న్ గ్రోవ్, లండన్లో అవివాహితుని గానే బ్రౌన్ మరణించాడు. ఆయనను కెన్సెల్ గ్రీన్ శ్మశానంలో సమాధి చేశారు.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

న్యూజిలాండ్‌కు డబుల్ షాక్!

భారత్‌తో వన్డే సిరీస్‌లో కివీస్‌కు వరుస ఎదురుదెబ్బలు




- గాయంతో చివరి రెండు వన్డేలకు లాకీ ఫెర్గూసన్ దూరం
- తలకు బంతి తగలడంతో బ్లెయిర్ టిక్నర్‌కు తప్పనిసరి విశ్రాంతి
- టిక్నర్ స్థానంలో క్రిస్టియన్ క్లార్క్‌కు అవకాశం
- ఇప్పటికే తొలి రెండు వన్డేల్లో ఓటమి.. కీలక ఆటగాళ్ల గాయాలతో సతమతం
- నేడు హామిల్టన్‌లో మూడో వన్డే

హామిల్టన్, నవంబర్ 9 (చురకలు): భారత్‌తో జరుగుతున్న ఐదు వన్డేల సిరీస్‌లో న్యూజిలాండ్‌కు ఎదురుదెబ్బల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే తొలి రెండు వన్డేల్లో ఓటమి పాలైన కివీస్‌కు మరో ఇద్దరు కీలక ఆటగాళ్లు దూరమయ్యారు. స్టార్ ఫాస్ట్ బౌలర్ లాకీ ఫెర్గూసన్ గాయం కారణంగా చివరి రెండు వన్డేలకు అందుబాటులో ఉండటం లేదని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. మరోవైపు తలకు బంతి తగిలిన బ్లెయిర్ టిక్నర్ తప్పనిసరి విశ్రాంతి కారణంగా మూడో, నాలుగో వన్డేలకు దూరమయ్యాడు. దీంతో టిక్నర్ స్థానంలో క్రిస్టియన్ క్లార్క్‌ను జట్టులోకి తీసుకున్నారు. వరుస ఓటములతో ఒత్తిడిలో ఉన్న న్యూజిలాండ్‌కు కీలక ఆటగాళ్ల గాయాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. వెల్లింగ్టన్‌లో జరిగిన రెండో వన్డేలో బ్యాటింగ్ చేస్తున్న సమయంలో బ్లెయిర్ టిక్నర్ హెల్మెట్‌కు బంతి బలంగా తగిలింది. అనంతరం నిర్వహించిన వైద్య పరీక్షల్లో అతడికి మెదడు కుదుపు లక్షణాలు లేవని నిర్ధారించినప్పటికీ, తలకు బంతి తగిలిన ఘటన నేపథ్యంలో ఏడు రోజుల విశ్రాంతి అవసరమైంది. దీంతో మూడో, నాలుగో వన్డేలకు అతడు అందుబాటులో ఉండటం లేదు. వర్షం కారణంగా అంతరాయం కలిగిన రెండో వన్డేలో టిక్నర్ స్థానంలో మాట్ ఫిషర్ బరిలోకి దిగాడు. తొలి వన్డేలో పదకొండో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన టిక్నర్ నాలుగు భారీ సిక్సర్లు బాది ఆకట్టుకున్నాడు. టిక్నర్ స్థానంలో నార్తర్న్ డిస్ట్రిక్ట్స్ ఫాస్ట్ బౌలర్ క్రిస్టియన్ క్లార్క్‌కు న్యూజిలాండ్ జట్టులో చోటు కల్పించారు. ఇటీవల ఫోర్డ్ ట్రోఫీలో ఆడిన క్లార్క్, భారత్-ఏ జట్టుతో జరిగిన మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్-ఏ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. నాలుగు రోజుల మ్యాచ్‌ల సిరీస్‌లో నాలుగు ఇన్నింగ్స్‌ల్లో నాలుగు వికెట్లు పడగొట్టడంతోపాటు బ్యాటింగ్‌లో 42, 41 పరుగులు సాధించాడు. న్యూజిలాండ్ తరఫున ఇప్పటికే నాలుగు వన్డేలు, ఒక అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడిన అనుభవం అతడికి ఉంది. న్యూజిలాండ్ స్టార్ పేసర్ లాకీ ఫెర్గూసన్ కుడి కాలి కండరానికి అయిన గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదు. భారత్‌తో జరిగిన టీ20 సిరీస్ సమయంలో అతడి కండరాల్లో స్వల్ప చీలిక ఏర్పడింది. దీంతో నాలుగో, ఐదో వన్డేలకు అతడిని అందుబాటులో ఉంచలేమని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు తెలిపింది. వేగవంతమైన బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టగల ఫెర్గూసన్ సేవలు అందకపోవడం కివీస్ బౌలింగ్ విభాగానికి ఎదురుదెబ్బగా మారింది. మరో కీలక పేసర్ మాట్ హెన్రీ ఆరోగ్య పరిస్థితిని న్యూజిలాండ్ వైద్య బృందం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తోంది. ఆక్లాండ్‌లో తొలి వన్డేకు ముందు సాధన సమయంలో డెవాన్ కాన్వేతో ఢీకొన్న హెన్రీకి అప్పట్లో మెదడు కుదుపు లక్షణాలు లేవని వైద్యులు నిర్ధారించారు. అయితే రెండో టీ20 సందర్భంగా అతడి కుడి తొడ కండరానికి స్వల్ప గాయమైంది. నాలుగో వన్డే నాటికి హెన్రీ తిరిగి అందుబాటులోకి వస్తాడని జట్టు యాజమాన్యం భావిస్తోంది. హెన్రీతోపాటు కైల్ జేమీసన్ కూడా వన్డే జట్టుతోనే కొనసాగనున్నారు. వాస్తవానికి మూడో వన్డే అనంతరం వీరిద్దరూ టెస్టు సిరీస్ సన్నాహాల కోసం జట్టును వీడాల్సి ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో వన్డే జట్టుతో కొనసాగాలని నిర్ణయించారు.

గాయాలతో సతమతమవుతున్న కివీస్

ఈ సిరీస్‌లో న్యూజిలాండ్‌ను గాయాల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ఇప్పటికే డెవాన్ కాన్వే, రచిన్ రవీంద్ర, మార్క్ చాప్‌మన్ గాయాల కారణంగా జట్టుకు దూరమయ్యారు. తాజాగా టిక్నర్, ఫెర్గూసన్ కూడా అందుబాటులో లేకపోవడంతో జట్టు కూర్పులో మార్పులు తప్పడం లేదు. తొలి రెండు వన్డేల్లో పరాజయం పాలైన న్యూజిలాండ్ నవంబర్ 10న హామిల్టన్‌లో జరిగే మూడో వన్డేలో విజయం సాధించి సిరీస్‌లో నిలవాలని పట్టుదలతో ఉంది. మూడో వన్డేకు న్యూజిలాండ్ జట్టు: మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), మైకేల్ బ్రేస్‌వెల్, క్రిస్టియన్ క్లార్క్, జాకబ్ డఫీ, మాట్ ఫిషర్, కైల్ జేమీసన్, నిక్ కెల్లీ, టామ్ లాథమ్ (వికెట్ కీపర్), డారిల్ మిచెల్, హెన్రీ నికోల్స్, గ్లెన్ ఫిలిప్స్, టిమ్ సీఫర్ట్, నాథన్ స్మిత్, విల్ యంగ్. నాలుగో వన్డేకు న్యూజిలాండ్ జట్టు: మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), ఫిన్ అలెన్, మైకేల్ బ్రేస్‌వెల్, క్రిస్టియన్ క్లార్క్, జాకబ్ డఫీ, మాట్ ఫిషర్, డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్, మిచెల్ హే (వికెట్ కీపర్), మాట్ హెన్రీ, కైల్ జేమీసన్, నిక్ కెల్లీ, టిమ్ సీఫర్ట్ (వికెట్ కీపర్), విల్ యంగ్.



హైదరాబాదీ బాడీబిల్డర్ వెంకటేశన్‌కు

మిస్టర్ నేచురల్ వరల్డ్ టైటిల్!

హైదరాబాద్, నవంబర్ 9 (చురకలు): లాస్ ఏంజిలెస్‌లో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగిన 'మిస్టర్ నేచురల్ వరల్డ్ బాడీబిల్డింగ్ ఛాంపియన్‌షిప్' పోటీల్లో హైదరాబాదీ బాడీబిల్డర్ కే.వెంకటేశన్ అద్భుత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు. నూరు శాతం వృక్ష ఆధారిత ఆహారాన్ని మాత్రమే తీసుకునే శాఖాహారి అయిన వెంకటేశన్, అంతర్జాతీయ స్థాయిలో తిరిగి స్వర్ణ పతకం గెలవడం పట్ల తీవ్ర సంతోషం వ్యక్తం చేశారు. గత ఏడాది కూడా ఇదే అంతర్జాతీయ పోటీల్లో స్వర్ణ పతకాన్ని సాధించినట్లు 49 ఏళ్ల వెంకటేశన్ గుర్తు చేశారు. ప్రతి బాడీబిల్డింగ్ పోటీ ఒక కొత్త సవాల్‌తో కూడుకున్నదని, ఈ ఛాంపియన్‌షిప్‌లో ప్రతీ పోటీదారు తీవ్రమైన పోటీని అందించారని తెలిపారు. శాఖాహారిగా ఉంటూ బాడీబిల్డింగ్ రంగాన్ని కొనసాగించడం అత్యంత కష్టమైన అంశమని, అయినప్పటికీ వృక్ష ఆధారిత జీవనశైలితో కూడా అనుకున్న ఫిట్‌నెస్ లక్ష్యాలను సులువుగా సాధించవచ్చని వెంకటేశన్ నిరూపించారు. బాడీబిల్డింగ్ కేవలం తన హాబీ మాత్రమే కాదని, అది తన ప్యాషన్, లైఫ్‌స్టయిల్ అని స్పష్టం చేశారు. డబ్బు కోసమో లేదా పేరు ప్రఖ్యాతుల కోసమో ఈ పోటీల్లో పాల్గొనలేదని, బాడీబిల్డింగ్‌ను హృదయపూర్వకంగా ఇష్టపడతానని పేర్కొన్నారు. ప్రతీ ఏడాదీ తనకి తానే సరికొత్త సవాళ్లు విసురుకుంటూ ముందుకు సాగుతానని చెప్పారు. కఠిన శ్రమ, అనంతమైన సహనం, నిరంతర క్రమశిక్షణ, తనపై తనకు ఉన్న నమ్మకం వల్లే ఈ పతకాన్ని సాధించగలిగినట్లు వెంకటేశన్ వివరించారు. క్రమశిక్షణ, నిరంతర శ్రమను ప్రదర్శించడం వల్లే ఈ స్థాయిలో ఫిట్‌నెస్ సాధించగలిగానన్నారు. తన ఫిట్‌నెస్ ప్రయాణంలో నిరంతరం సహకరిస్తున్న జూబ్లీహిల్స్‌లోని 'వన్ ఫిట్‌నెస్ స్టూడియో' కో-ఓనర్ కుమార్ మన్నావాకు ఈ సందర్భంగా వెంకటేశన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



కోహ్లీతో మాట్లాడాలంటే కోచ్‌లే భయపడతారు: ర్యాన్‌టెన్ డస్కటే!

హైదరాబాద్, నవంబర్ 9 (చురకలు): భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై టీమిండియా మాజీ అసిస్టెంట్ కోచ్ ర్యాన్‌టెన్ డస్కటే ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఒకానొక దశలో విరాట్ కోహ్లీ వరుసగా ఫామ్‌లేమితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. మ్యాచ్‌ల్లో ఒకే తరహాలో ఆఫ్ స్టంప్ బయట వెళ్తున్న బంతులను డ్రైవ్ చేయబోయి క్యాచ్ ఔటై పెవిలియన్ చేరేవాడు. ఈ సమయంలో కోచింగ్ సిబ్బంది ఎందుకు జోక్యం చేసుకోవడం లేదనే విమర్శలు కూడా వచ్చాయి. ఇదే విషయంపై స్పందించిన డస్కటే, మైదానంలో స్టార్‌డమ్ కలిగిన ఆటగాళ్లకు సలహాలు ఇవ్వాలంటే కోచ్‌లే ఇబ్బందిపడతారని అభిప్రాయపడ్డాడు. ఎవరైనా ఒక అగ్రశ్రేణి స్టార్ ప్లేయర్ పరుగులు చేసేందుకు ఇబ్బంది పడుతుంటే జోక్యం చేసుకునేందుకు చాలా మంది కోచ్‌లు భయపడతారని డస్కటే తెలిపాడు. అనవసరంగా తమ విషయంలో జోక్యం చేసుకుంటున్నారని లేదా ఇబ్బంది పెడుతున్నారని ఆటగాడు భావిస్తాడేమోనని ఆందోళన చెందుతారని పేర్కొన్నాడు. అయితే ఒక ఆటగాడికి ఉపయోగపడే ఉపయోగకరమైన సూచన ఇవ్వాలా? లేక అతడిని మరింత గందరగోళానికి గురిచేయాలా? అనే విషయంలో స్పష్టమైన సమతుల్యత అవసరమని స్పష్టం చేశాడు. గతంలో ఆస్ట్రేలియా పర్యటనలో కోహ్లీ వరుసగా ఒకే తరహాలో ఔటవుతుండటాన్ని గమనించానని డస్కటే వెల్లడించాడు. నాలుగో టెస్టు సమయంలో అతడితో ఈ విషయం మాట్లాడాలని అనుకున్నానని, అయితే ఎలా చెప్పాలి? ఎప్పుడు చెప్పాలి? అన్నదానిపై చాలా ఆలోచించినట్లు చెప్పాడు. చివరకు వర్షం కారణంగా ఆటకు విరామం వచ్చిన సమయంలో ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా చాలా సానుకూలంగా అతడితో మాట్లాడానని తెలిపాడు. డస్కటే సలహాపై విరాట్ కోహ్లీ చాలా అద్భుతంగా స్పందించాడని కొనియాడాడు. తన షాట్ ఎంపిక వెనుక ఉన్న కారణాలను విరాట్ వివరించాడని, తాను ఎందుకు ఆ విధంగా డ్రైవ్ చేయాలనుకుంటున్నాడో స్పష్టం చేశాడన్నాడు. కోహ్లీ అభిప్రాయాన్ని అర్థం చేసుకున్న తర్వాత దానికి అనుగుణంగా కొన్ని చిన్న మార్పుల గురించి ఇద్దరం చర్చించగలిగామని వివరించాడు. ఆ క్లిష్ట సమయంలో తన సమస్యపై మాట్లాడటానికి ఎవరో ఒకరు ముందుకు రావాలని కోహ్లీ కూడా నిజంగా కోరుకున్నాడని డస్కటే పేర్కొన్నాడు.



క్రికెట్ పుట్టినింటికే ఆర్థిక కష్టాలు!

రూ.627 కోట్ల భారీ నష్టం దిశగా ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు

2027లో టీమిండియా పర్యటన లేకపోవడంతో ఆదాయానికి గండి

లండన్, నవంబర్ 9 (చురకలు): క్రికెట్‌కు పుట్టినిల్లయిన ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) త్వరలో భారీ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు సుమారు 50 మిలియన్ పౌండ్లు (భారత కరెన్సీలో దాదాపు రూ. 627 కోట్లు) భారీ నష్టాన్ని మూటగట్టుకోబోతున్నట్లు తెలుస్తోంది. టీమిండియా పర్యటన లేకపోవడం, మరోవైపు ఐసీసీ నుంచి రావాల్సిన రెవెన్యూలో కోత పడనుండటంతో ఈసీబీకి ఈ దుస్థితి తలెత్తింది. ప్రముఖ మీడియా సంస్థ 'ది గార్డియన్' కథనం ప్రకారం.. ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ఆర్థిక పరిస్థితి ఇంతలా దిగజారడానికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది, ఇంగ్లాండ్‌లో జరిగే మ్యాచ్‌లు, బ్రాడ్‌కాస్టింగ్ ఆదాయం పూర్తిగా అక్కడ పర్యటించే జట్లపై ఆధారపడి ఉంటాయి. అయితే 2027లో భారత జట్టు ఇంగ్లాండ్‌లో పర్యటించట్లేదు. దీంతో అటు టీవీ వీక్షకాదరణ, ఇటు కమర్షియల్ ఆదాయంపరంగా బోర్డుకు కోలుకోలేని దెబ్బ తగలనుంది. ఇక రెండో కారణం అంతర్జాతీయ క్రికెట్ మండలి తీసుకున్న నిర్ణయం. 2027లో మెంబర్ కంట్రీస్‌కు పంచాల్సిన బ్రాడ్‌కాస్ట్ రెవెన్యూలో కొంత మొత్తాన్ని హోల్డ్‌లో పెట్టాలని ఐసీసీ భావిస్తోంది. 2028 నుంచి ప్రారంభమయ్యే కొత్త రైట్స్ సైకిల్‌లో బ్రాడ్‌కాస్టింగ్ డీల్ విలువ తగ్గే అవకాశం ఉందని ఐసీసీ అంచనా వేస్తోంది. ఆ సమయంలో క్రికెట్ బోర్డులపై ఒకేసారి ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు, ముందు జాగ్రత్తగా 2027 పంపకాల నుంచే కొంత సొమ్మును దాచిపెడుతోంది. ఈ నిర్ణయం వల్ల ఒక్క ఇంగ్లాండే కాకుండా 12 ఫుల్ మెంబర్ నేషన్స్‌పై ప్రభావం పడనుంది. ఈ నష్టాన్ని తగ్గించుకునేందుకు ఈసీబీ ప్రయత్నాలు చేస్తూ, ఐసీసీతో చర్చలు జరిపి నష్టాన్ని 35 మిలియన్ పౌండ్లకు (సుమారు రూ. 439 కోట్లు) పరిమితం చేయాలని కోరుతోంది.

భారత మార్కెట్‌పై విపరీతమైన ఆధారపడటమే కారణం

ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ఇంతలా ఆందోళన చెందడానికి భారత మార్కెట్‌పై ఉన్న అపరిమితమైన ఆధారపడటమే ప్రధాన కారణం. అక్కడ టీవీ రైట్స్, వ్యూయర్‌షిప్ రెవెన్యూ విలువ భారీగా పెరగాలంటే టీమిండియా మ్యాచ్‌లు అత్యంత కీలకం. ప్రస్తుతం సోనీ పిక్చర్స్‌తో ఈసీబీకి 185 మిలియన్ పౌండ్ల (సుమారు రూ. 2,323 కోట్లు) ఆరేళ్ల కాంట్రాక్ట్ ఉంది. ఇది 2028తో ముగియనుండగా, ఆ తర్వాత వచ్చే కొత్త డీల్ విలువ బాగా తగ్గే అవకాశం ఉంది. ఈ ఆర్థిక ప్రభావం కేవలం ఈసీబీ బోర్డుతోనే ఆగిపోకుండా, అక్కడి కౌంటీ సిస్టమ్‌పై కూడా తీవ్రంగా పడేలా ఉంది. ఈసీబీకి ఆదాయం తగ్గితే, అది కౌంటీలకు ఇచ్చే ఆర్థిక సహకారం (ఖీబఅఱఱఅస్త్ర) భారీగా తగ్గిపోతుంది. ఇప్పటికే అక్కడ ఉన్న 18 కౌంటీ జట్లలో 10 జట్లు నష్టాల్లో నడుస్తున్నాయి. 2025లో ఈసీబీ 12.6 మిలియన్ పౌండ్ల లాభం సాధించినప్పటికీ, 2027లో పరిస్థితులు ఊహించిన దానికంటే చాలా దారుణంగా ఉండేలా కనిపిస్తున్నాయి.

అనిరుధ్-కావ్య మారన్ పెళ్లికి వేళాయే

వివాహం తేదీ, స్థలం, పూర్తి వివరాలు ఇవే..!



చెన్నై, నవంబర్ 9 (చురకలు): కోలీవుడ్ ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ కావ్య మారన్‌ల వివాహ ముహూర్తం దగ్గర పడింది. ఈ అంగరంగ వైభవంగా జరిగే పెళ్లి వేడుకల కోసం ఇప్పటికే పలువురు ప్రముఖులు వెన్యూకి బయలుదేరారు. తాజాగా సూపర్‌స్టార్ రజినీకాంత్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్‌లు కుటుంబ సమేతంగా గ్రీస్ దేశానికి పయనమయ్యారు. చెన్నై ఎయిర్‌పోర్ట్ వద్ద వీఐపీ గెస్ట్‌లు గ్రీస్ ఫ్లైట్ ఎక్కుతున్న విజువల్స్, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సమాచారం ప్రకారం ఈ బిగ్ వెడ్డింగ్ నవంబర్ 10, 11 తేదీల్లో రెండు రోజుల పాటు గ్రీస్ దేశంలో అత్యంత ఘనంగా జరగనుంది. చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో సూపర్ స్టార్ రజినీకాంత్‌తో పాటు ఆయన కుమార్తె ఐశ్వర్య రజినీకాంత్ కనిపించారు. రజినీకాంత్ బిజినెస్ క్లాస్ కేబిన్ లో ఫ్లైట్ స్టాఫ్‌తో ఉన్న ఫోటోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ఎంకే స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్‌లు సోమవారం ఉదయం ఎమిరేట్స్ ఫ్లైట్‌లో దుబాయ్ మీదుగా గ్రీస్ వెళ్లారని, వేడుకలు ముగించుకుని నవంబర్ 13న చెన్నైకి తిరిగి వస్తారని సమాచారం. అనిరుధ్ తండ్రి రవి రాఘవేంద్ర భార్య లక్ష్మి, రజినీకాంత్ భార్య లతా రజినీకాంత్‌కు చెల్లెలు కావడంతో అనిరుధ్ స్వయానా రజినీకి మేనల్లుడు అవుతారు. రజినీ నటించిన 'పేట', 'దర్బార్', 'జెయిలర్', 'వేట్టయాన్', 'జెయిలర్ 2' చిత్రాలకు అనిరుధే మ్యూజిక్ అందించడం గమనార్హం. రాజకీయ, సినీ బంధుత్వం.. చెన్నైలో రిసెప్షన్మరోవైపు కావ్య మారన్‌కు కూడా ఎంకే స్టాలిన్ కుటుంబంతో బలమైన చుట్టరికం ఉంది. కావ్య సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్, కావేరి మారన్ దంపతుల కుమార్తె. కళానిధి మారన్, ఎంకే స్టాలిన్ ఇద్దరూ వరుసకు బావబామరుదులు అవుతారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ సీఈఓగా, సన్ టీవీ నెట్‌వర్క్ బాధ్యతల్లో కావ్య క్రికెట్, బిజినెస్ ప్రపంచంలో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్నారు. ఈ డెస్టినేషన్ వెడ్డింగ్ గ్రీస్‌లో నవంబర్ 10, 11 తేదీల్లో అత్యంత సన్నిహితులు, కొద్దిమంది బంధుమిత్రుల సమక్షంలో ప్రైవేట్‌గా జరగనుండగా, గెస్టుల ప్రయాణ, వసతి ఏర్పాట్లన్నీ మారన్ కుటుంబమే దగ్గరుండి చూసుకుంటోంది. చెన్నైలో జరగబోయే గ్రాండ్ రిసెప్షన్ నవంబర్ 21న ఖాయమైంది. కళానిధి మారన్ దంపతులు స్వయంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ చెన్నై రిసెప్షన్‌కు భారత ప్రధాని నరేంద్ర మోడీ, కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, తమిళనాడు ముఖ్యమంత్రి సీ. జోసెఫ్ విజయ్, అజిత్ కుమార్ సహా సినిమా, బిజినెస్, క్రికెట్ లోకానికి చెందిన హేమాహేమీలు హాజరుకానున్నారు.



లోకేష్ కనగరాజ్ 'ఆర్ఎక్స్'లో రెజీనా!

లోకేష్ కనగరాజ్‌కు చెందిన జీ స్క్వాడ్, మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'ఆర్ఎక్స్' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలో నటి స్తున్న ఈ చిత్రానికి విశాల్ వెంకట్ దర్శకత్వం వహిస్తున్నారు. దీపావళి సందర్భంగా విడుదలైన పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ప్రింటెడ్ బ్లౌజ్‌తో కూడిన సంప్రదాయ మస్టర్డ్ ఎల్లో కలర్ చీరలో రెజీనా రద్దీగా ఉన్న రైలులో ప్రయాణికుల మధ్య నిలబడి కనిపిస్తున్నారు. ఆమె ముఖంలో కనిపిస్తున్న సీరియస్‌నెస్ ఏదో ప్రమాదకరమైన పరిస్థితిలో ఉన్న పాత్రలా అనిపిస్తోంది. పోస్టర్‌పై కనిపించే ఈసీజీ తరహా గీతలు కూడా సస్పెన్స్‌ను మరింత పెంచుతున్నాయి. రెజీనా పవర్‌ఫుల్ లుక్ ఆమె పాత్రపై ఆసక్తిని కలిగిస్తోంది. పోస్టర్ డిజైన్ చూస్తుంటే ఈ సినిమా రా అండ్ రియలిస్టిక్, గ్రిప్పింగ్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించనుందని అనిపిస్తోంది. 'సిల నేరంగళి ల్ సిల మనిధర్గల్', 'బాంబ్' వంటి చిత్రాలతో తనదైన కథన శైలికి గుర్తింపు తెచ్చుకున్న విశాల్ వెంకట్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. హరిహరన్ రాజు అందించిన కథ ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఆశమీర అయ్యప్పన్ సంభాషణలు రాశారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తుండగా, ఎస్.కె. సెల్వకుమార్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జి.కె. ప్రసన్న ఎడిటర్‌గా, కె. మనోజ్ కుమార్ ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ చిత్రానికి ప్రదీప్ భూపతి కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ మొత్తాన్ని చెన్నైలో పూర్తి చేశారు. దీంతో ప్రధాన చిత్రీకరణ విజయవంతంగా ముగిసింది.



'ఈ నగరానికి ఏమైంది 2' నుంచి

యూత్‌ఫుల్ సాంగ్ రిలీజ్

తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో, విశ్వక్ సేన్ ప్రధాన పాత్రలో 'ఈ నగరానికి ఏమైంది 2' (ఈఎన్ఈ రిపీట్) సిద్ధమైంది. నవంబర్ 19న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఇందులోని యూత్‌ఫుల్ సాంగ్‌ని విడుదల చేశారు. 'మిత్వా.. మిత్వా' అంటూ సాగే పాటకు భరద్వాజ్ లిరిక్స్ అందించారు.



స్వీటీ నుంచి స్వీట్ న్యూస్ ఎప్పుడో?

సినిమాలకు, సామాజిక మాధ్యమాలకు దూరంగా అనుష్క శెట్టి

పుట్టినరోజునైనా శుభవార్త వస్తుందనుకుంటే నిరాశే!

హైదరాబాద్, నవంబర్ 9 (చురకలు): సినిమాలు చేయకపోయినా కొంతమంది హీరోయిన్లు సోషల్ మీడియా ద్వారా అభిమానులతో ఎప్పుడూ టచ్‌లో ఉంటారు. తమ వ్యక్తిగత విషయాలు, సినిమా అప్‌డేట్స్‌ను ఎప్పటికప్పుడు పంచుకుంటూ ఫ్యాన్స్‌కు దగ్గరగా ఉంటారు. కానీ సీనియర్ హీరోయిన్ అనుష్క శెట్టి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఆన్ స్క్రీన్, ఆఫ్ స్క్రీన్ మాత్రమే కాకుండా సోషల్ మీడియాలో కూడా ఎక్కడా కనిపించడం లేదు. దీంతో అనుష్క అభిమానులు ఆమె కొత్త సినిమా అప్‌డేట్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అనుష్క చివరిగా నటించిన 'ఘాటీ' చిత్రం విడుదలై ఏడాది దాటిపోయినా.. ఆమె నుంచి మరో కొత్త సినిమా ప్రకటన వెలువడలేదు. మరోవైపు మలయాళంలో మూడేళ్ల క్రితం అంగీకరించిన 'కథనార్' సినిమా కూడా ఇంకా విడుదలకు నోచుకోలేదు. ఈ మూవీ ట్రైలర్ విడుదలై ఏడు నెలలు దాటుతున్నా.. సినిమా ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే విషయంపై చిత్రబృందం స్పష్టత ఇవ్వలేదు. మలయాళ స్టార్ హీరో జయసూర్య ప్రధాన పాత్రలో భారీ బడ్జెట్‌తో కథనార్ తెరకెక్కుతోంది. ఇందులో 'నీల' అనే కీలకమైన పాత్రలో అనుష్క కనిపించనున్నారు. శ్రీ గోకులం మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా 15 భాషల్లో విడుదల చేయాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా విడుదల కోసం అనుష్క ఫాన్స్ తీవ్రంగా ఎదురుచూస్తున్నారు. పుట్టినరోజున రాని అప్‌డేట్.. నిరాశలో అభిమానులునవంబర్ 7న అనుష్క పుట్టినరోజు సందర్భంగా అయినా కథనార్ సినిమా నుంచి ఏదైనా అప్‌డేట్ వస్తుందని అభిమానులు ఆశించారు. కానీ ఫ్యాన్స్‌కు నిరాశే మిగిలింది. కనీసం పుట్టినరోజు శుభాకాంక్షలు కూడా చిత్రబృందం నుంచి రాకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీంతో స్వీటీ అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అనుష్క కెరీర్‌లో మరో భారీ ప్రాజెక్ట్‌గా 'బాహుబలి 3' ఉండొచ్చనే ప్రచారం గతంలో జరిగినప్పటికీ, ఈ సినిమాపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పష్టత లేదు. అనుష్క కొత్త సినిమా ఎప్పుడు ప్రకటిస్తుందో, కథనార్ ఎప్పుడు విడుదలవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సినిమాలకు, సోషల్ మీడియాకు దూరంగా ఉంటున్న స్వీటీ.. త్వరలోనే అభిమానులకు ఏదైనా స్వీట్ న్యూస్ చెబుతుందేమో చూడాలి.



బాక్సాఫీస్ వద్ద 'రామాయణ' ప్రభంజనం

4 రోజుల్లోనే రూ.500 కోట్లకు చేరువలో వసూళ్లు!



బాలీవుడ్‌లో భారీ అంచనాల మధ్య విడుదలైన మైథలాజికల్ ఎపిక్ మూవీ 'రామాయణ' బాక్సాఫీస్ వద్ద సంచలన వసూళ్లతో దూసుకెళ్తోంది. నితీశ్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్, సాయిపల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ అందుకుంటోంది. నవంబర్ 5న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా తొలి నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 500 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. ముఖ్యంగా దీపావళి రోజున బాలీవుడ్‌లో అత్యధిక నెట్ వసూళ్లు సాధించిన చిత్రంగా 'రామాయణ' సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రముఖ ట్రేడ్ ట్రాకింగ్ సంస్థ సాక్నిల్క్ వెల్లడించిన వివరాల ప్రకారం.. 'రామాయణ' తొలి నాలుగు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ. 499.20 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు సమాచారం. భారతదేశంలో ఈ చిత్రం రూ. 287.64 కోట్ల గ్రాస్, రూ. 240.92 కోట్ల నెట్ కలెక్షన్లను రాబట్టింది. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో సుమారు రూ. 214 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ సినిమాలోని 3ణ వెర్షన్‌కు కూడా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. 3ణ ఫార్మాట్ ద్వారా సుమారు రూ. 115.46 కోట్ల వసూళ్లు వచ్చినట్లు సమాచారం. భారీ విజువల్స్, గ్రాండ్ సెట్స్, స్టార్ క్యాస్ట్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. 'రామాయణ' బాక్సాఫీస్ ప్రదర్శనలో మరో విశేషం దీపావళి రోజు సాధించిన వసూళ్లు. ఆదివారం ఒక్కరోజే భారత్‌లో రూ. 56.15 కోట్ల నెట్ కలెక్షన్లు రాబట్టినట్లు ట్రేడ్ సమాచారం. దీంతో దీపావళి రోజున అత్యధిక నెట్ వసూళ్లు సాధించిన బాలీవుడ్ సినిమాగా ఈ చిత్రం నిలిచింది. ఇప్పటివరకు ఈ రికార్డు సల్మాన్ ఖాన్ నటించిన 'టైగర్ 3' పేరిట ఉండేది. ఆ సినిమా దీపావళి రోజున రూ. 44.50 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. ఇప్పుడు 'రామాయణ' ఆ రికార్డును అధిగమించి సరికొత్త బెంచ్‌మార్క్ సెట్ చేసింది. అయితే తొలి వారాంతం ముగియడంతో ఇకపై వసూళ్ల వేగం ఎలా కొనసాగుతుందనేది ఆసక్తికరంగా మారింది. 'రామాయణ' నాలుగు రోజుల కలెక్షన్ల వివరాలు చూస్తే.. వరల్డ్ వైడ్ గ్రాస్: రూ. 499.20 కోట్లకు పైగా వసూళ్లు సాధించగా, ఇండియా గ్రాస్: రూ. 287.64 కోట్లు, ఇండియా నెట్: రూ. 240.92 కోట్లు, ఓవర్సీస్ గ్రాస్: సుమారు రూ. 214 కోట్లు, 3ణ ఫార్మాట్ వసూళ్లు: సుమారు రూ. 115.46 కోట్లు. ఒకవైపు బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తుండగా, మరోవైపు సినిమా పైరసీ విషయంలో చిత్ర బృందం కఠినంగా స్పందించింది. థియేటర్లలో సినిమాను రహస్యంగా రికార్డు చేసి, ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంపై బాంబే హైకోర్టు సీరియస్ అయినట్లు లీగల్ నోటీసుల ద్వారా వెల్లడించింది.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com